# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

29.03.2026 ఆదివారం SUNDAY | సంపుటి (volume): 1 సంచిక (Issue): 248 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


## అయోధ్యలో అగ్నిప్రమాదం

- అగ్నికి ఆహుతి అయిన యజ్ఞశాల పందిళ్లు
- ప్రమాదంలో ప్రాణనష్టం లేదని వివరం

4





## రావద్దన్నారు.. పదవి పోతుందన్నారు

- నొయిడా సెంటిమెంట్‌ను తుడిచిపెట్టాం..
- మూఢనమ్మకాలతో అభివృద్ధిని గాలికొదిలేశారు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

4

ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా శనివారం నొయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గత పాలకుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న 'నొయిడా సెంటిమెంట్' కారణంగానే గత నాయకులు ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని ఆయన విమర్శించారు.

## భద్రాచలంలో గవర్నర్ దంపతులు

3



## మొజ్తబా ఖమేనీ మృతి?

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు తదుపరి లక్ష్యం క్యూబా అంటూ హెచ్చరికలు

4





## 'లాక్‌డౌన్' ప్రసక్తే లేదు..

వదంతులు నమ్మొద్దు

కేంద్ర ప్రభుత్వం

4

## కాళేశ్వరం అవినీతికి కేసీఆర్ బాధ్యుడు

- అవినీతిని పట్టుకోవడంలో సీఎం రేవంత్ విఫలం
- కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్



3

# అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణ

### రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు

- రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు
- అక్రమాలను సహించేది లేదని వెల్లడి
- ప్రభుత్వ ఖజానాకు గండికొడితే ఊరుకోం
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన



"మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శాసనసభలో ప్రకటించారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం. సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై విచారణకు ప్రభుత్వం సిద్ధం అని తెలిపారు. గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణకు సిద్ధం అని ప్రకటించారు."

**హైదరాబాద్, మార్చి 28:** రాఘవ కన్‌స్ట్రక్షన్‌తోపాటు అన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నాం అని తెలిపారు. విచారణలో నిజాలు నిగ్గు తేల్చి శాసనసభలో నివేదిక పెడతాం. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే. వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతూ సాగే అక్రమ మైనింగ్ వ్యవహారాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శించారు.

మిగతా 2 లో

## తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం

ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సీఎం

## చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

వివరాలు 2వ పేజీలో



## మూసీని అడ్డుకుంటే శివతాండవమే

అడ్డుకున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారు

మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం

దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం

మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సీఎం రేవంత్

2

## ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో

- అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం
- మెట్రో విస్తరణకు మార్గం సుగమం
- తీర్మానం ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్

.. వివరాలు 2లో



## పోలీస్ శాఖపై నిర్లక్ష్యం

- నియామకాల్లో తీరని జాప్యం
- ఆర్టీసీ, బీసీ, సంక్షేమంలోనూ అదే వైఖరి
- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్

3



## మరోమారు పెరిగిన బంగారం ధరలు

2



# అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణ

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడ గండి పడినా, ఖనిజ సంపద దోపిడీకి గురైనా తాము చూస్తూ ఊరుకోబోమని, అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంపై ముఖ్యమంత్రి సాక్ష్యాధారాలతో సమాధానమిస్తూ, ఇప్పటికే ఆ సంస్థకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ జరిపిన విచారణలో భాగంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుండి భారీ మొత్తంలో పన్నులు వసూలు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సినరేజ్ ఛార్జీల కింద రూ. 1,52,97,825, అలాగే పర్మిట్ ఫీజు కింద రూ. 22,25,446 మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పటికే ఆ సంస్థ నుండి కట్టించుకుందని ఆయన సభకు తెలిపారు. ఎవరైనా మంత్రుల పేర్లు చెప్పుకుని లేదా రాజకీయ పలుకుబడితో పన్నులు ఎగ్గొట్టాలని చూస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో రాజీపడేది లేదని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు.

# తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

- గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం
- ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సీఎం

**హైదరాబాద్,మార్చి 28(ఆర్ఎన్ఎ):** ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్-2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు




విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్‌బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారున్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# మూసీని అడ్డుకుంటే శితాండవమే





- ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు
- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సిఎం రేవంత్

**రంగారెడ్డి, మార్చి 28:** రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

**అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం**

**తీర్మానం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్**

**హైదరాబాద్, మార్చి 28:** హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది. నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్-2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవు తున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్-1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన ప్రక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్-2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్-2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫేజ్-2 విస్తరణకు త్వరితగతిన ఆమోదం పొందేందుకు కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, మెట్రో రైలుపై ప్రభుత్వ పెత్తనం పెరగడం వల్ల సామాన్య ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని, నగరం ప్రపంచ పటంలో ఒక అత్యాధునిక రవాణా వ్యవస్థ కలిగిన మెట్రోపాలిటన్‌గా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే అసెంబ్లీలో తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించడం సరికాదని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. నష్టాలతో సతమతమవుతున్నామని, మెట్రో రైలు నిర్వహణ నుంచి తప్పుకొంటామని నాలుగైదేళ్లుగా ఎల్అండ్‌టీ సంస్థ చెబుతోంది. ఇదే విషయాన్ని గత సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. సుదీర్ఘ చర్చల తర్వాత ఎల్అండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణంతో పాటు సంస్థ ఈక్విటీ వాటా రూ.2 వేల కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎల్అండ్‌టీ నుంచి మెట్రో రైలును టేకోవర్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు లేకుండానే ప్రభుత్వం కార్యకలాపాలను నిర్వహించనుంది. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని హరీష్ రావు అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు.



# చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

**పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి**

**అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ**

**అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందచేత**

**హైదరాబాద్, మార్చి 28:** దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖపై తీవ్ర నిర్లక్ష్యం

**నియామకాల్లో తీరని జాప్యం**

**ఆర్టీసీ, బీసీ, సంక్షేమంలోనూ అదే వైఖరి**

**అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్**

**హైదరాబాద్, మార్చి 28:** పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడున్నా లడ్డూ వస్తుందని అంటారు.. కానీ ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం సమాజం పనిచేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ప్రమోషన్లను పక్కనబెట్టారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులకు ఈహెచ్ఎస్‌ను ఇంప్లిమెంట్ చేస్తలేరని పేర్కొన్నారు. 2024 తర్వాత ఇప్పటివరకు పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదని అన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 400 కోట్ల బడ్జెట్‌ను ఎందుకు తగ్గించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. పెంచాల్సిన బడ్జెట్ ఎందుకు తగ్గిందని నిలదీశారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అస్యూరెన్స్ లేదని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు , కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని హరీశ్‌రావు అన్నారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు నిరసనగా, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు నిరసనగా, పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పనందుకు నిరసనగా, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు నిరసనగా, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా, బీసీ సబ్ ఎ÷-లాన్ నిదుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు.

# మరోమారు పెరిగిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ, మార్చి 28:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో అంచనాలకు అందని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గత రెండు రోజులుగా ధరల్లో ఓ మోస్తరు మార్పులు కనిపించినప్పటికీ నేడు అనూహ్యంగా భారీ స్థాయిలో ధరలు పెరిగాయి. భారత్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర సగటున రూ.2,500 మేర పెరిగింది. కిలో వెండి ధరలో రూ.5 వేల మేర పెరుగుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (మార్చి 28) ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090కు చేరుకుంది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధర రూ.2,510 మేర పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.2,300ల మేర పెరిగి రూ.1,35,750కు చేరుకుంది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే రూ.5 వేల మేర ఎగబాకింది. ప్రస్తుతం రూ.2.5 లక్షల వద్ద కొనసాగుతోంది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ 24 క్యారెట్ల పసిడి ధర 4,492 డాలర్ల వద్ద కదలాడుతోంది. ఔన్స్ వెండి ధర 69 డాలర్లుగా ఉంది.

# కాళేశ్వరం అవినీతికి కేసీఆర్ బాధ్యుడు

- అవినీతిని పట్టుకోవడంలో సీఎం విఫలం
- కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్



**కరీంనగర్, మార్చి 28 :** కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీ డియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపి పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికార ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు.'సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది. ప్రజలు సైతం ఆయన భాషపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహార శైలి మార్చుకుంటే మంచిదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు గుడ్లు గుర్తుకు వస్తాయి. గాడిద గుడ్లు అంటారు. ఎన్నికలు అయిపోయాక తొండలు గుర్తుకు వస్తాయి. తొక్కుడు గుర్తుకు వస్తుందన్నారు. కాళేశ్వరం గురించి ప్రస్తావిస్తూ.. ఆ ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు.. కాళేశ్వరం కూలిపోవడానికి అప్పుడున్న బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లు కలిసే రాజకీయం చేస్తారని ఆరోపించారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి.. ఉత్తరాది రాష్ట్రాల నాయకుడు కాదు. ముందు మీరు ప్రకటించిన మొదలు ఆరు గ్యారంటీలు అమలు చెయ్యాలి. కేంద్రం ఏమిస్తున్నదో తెలంగాణ ప్రజానీకానికి తెలుసు. తెలంగాణ రాష్ట్రం ఖజానా పరిస్థితి బాగాలేదు.' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారనే ప్రచారంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ..'తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇది సంకేతం. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ స్థాపించే హక్కు కలిగి ఉంటారు. అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించింది. కవిత కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచనను స్వాగతిస్తున్నాం' అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. ప్రజలకు ఉపయోగ పడితే ఆ ఆ పార్టీలను వారు స్వాగతిస్తారన్నారు.

# బెంగాల్లో గెలిచాక ఢిల్లీలో పాగా వేస్తాం

- మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు



**కోల్‌కతా, మార్చి 28:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటుచేసుకోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమబెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే బీజేపీ దేశంలో అధికారం కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఢిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకు వెళ్తానని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఓటర్లను హెచ్చరించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ బీజేపీ నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' పక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను బీజేపీ పావులా వాడుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితోపాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. బెంగాల్‌లో గెలువగానే దేశంలోని ఇతర రాజకీయ పార్టీలతో కలిసి కేంద్రంలో బీజేపీని గద్దె దించుతానని హెచ్చరిక చేశారు.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

- ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక



**హైదరాబాద్, మార్చి 28:** బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

# ఇరాన్‌పై భూతల దాడులు చేయాల్సిన అవసరం

**అనుకున్న సమయానికన్నా ముందే యుద్ధం ముగింపు**

**అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో**



ప్యారిస్, మార్చి 28: ఇరాన్‌పై అనుకున్న సమయం కంటే ముందే దాడులను ముగిస్తామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో అన్నారు. మరికొన్ని వారాల్లో ఇరాన్ యుద్ధం ముగుస్తుందని తెలిపారు. ఇరాన్‌పై భూతల దాడులు చేయాల్సిన అవసరం లేకుండానే తమ లక్ష్యాలను సాధిస్తామని అన్నారు. తమ దాడులు మరో రెండు, మూడు వారాల్లో పూర్తవుతాయని, అప్పటికి టెహ్రాన్ పూర్తిగా బలహీనపడుతుందని పేర్కొన్నారు. ఫ్రాన్స్‌లో జీ-7 ప్రతినిధులతో సమావేశమైన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రుబియో మాట్లాడారు. 'హోర్ముజ్‌లో జరిగే చమురు రవాణాపై ఇరాన్ సుంకాలు విధించకుండా నిరోధించడమే మా తక్షణ కర్తవ్యం. ఆ సుంకాల వల్ల అనేక దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. యుద్ధం ముగింపుపై చర్చల కోసం ఇరాన్ పాలకవర్గం మాకు సందేశాలు పంపింది. అయితే మేం ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు' అని రుబియో తెలిపారు. పశ్చిమాసియాలో అమెరికా తన సైనిక బలగాల మోహరింపును ఇటీవల భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై కూడా రుబియో మాట్లాడారు. 'ఇరాన్‌పై భూతల దాడులు చేయాలని మేం అనుకోవడం లేదు. కానీ, అత్యవసర పరిస్థితులు తలెత్తితే మాత్రం భూతల దాడులకు దిగక తప్పదు. అందుకే అమెరికా దళాలు ఇరాన్ చుట్టూ మోహరిస్తున్నాయి' అని రుబియో స్పష్టం చేశారు.



# భద్రాచలంలో గవర్నర్ దంపతులు

**భద్రగిరి మార్ట్ ను ప్రారంభించిన శుక్లా**

**భద్రాచలం,మార్చి 28:** భద్రాచలంలో అంగరంగ వైభవంగా శ్రీరాముని పట్టాభిషేక మహోత్స వాన్ని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా దంపతులు తిలకించారు. బద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు,గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు తొలిసారి వచ్చిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ప్రజా ప్రతినిధులు , అధికారులు ఘన స్వాగతం పలికారు. బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ హెలీప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి గవర్నర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ఐటిడిఎ ఆధ్వర్యంలో భద్రాచలంలో - భద్రగిరి మార్ట్ ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. మార్ట్ లో విక్రయానికి ఉంచిన గిరిజన ఉత్పత్తుల గురించి భద్రాచలం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్, సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్ లు గవర్నర్ కు వివరించారు. గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, పలు ఉత్పత్తులను గవర్నర్ దంపతులు కొనుగోలు చేశారు.

# పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య



మమత | మణికంఠ | ప్రళయశ్రీ

**సంగారెడ్డి, మార్చి 28:** సంగారెడ్డి జిల్లా కంది మండలం జులకల్‌లో శనివారం దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలకు విషమిచ్చిన తల్లి.. తానూ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతులను మమత (28), కుమారుడు మణికంఠ (5), కుమార్తె ప్రళయ (4) గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది జనవరిలో రోడ్డు ప్రమాదంలో మమత భర్త మృతి చెందాడు. భర్త చనిపోయడాని మనస్తాపానికి గురైన మమత పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు జులకల్ చేరుకొని వివారాలు సేకరిస్తున్నారు.

# ఫుట్‌బాల్ క్రీడాకారిణి పట్ల అసభ్య ప్రవర్తన : కేసు నమోదు

**హైదరాబాద్, మార్చి 28:** జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న క్రీడాకారిణితో కొందరు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించారు. కుక్క విషయంలో మొదలైన గోడవ చివరకు క్రీడాకారిణి కుటుంబానికి ప్రాణభయంగా మారింది. కొందరు మందుబాబులతో క్రీడాకారిణికి కుక్క విషయంలో గొడవ జరిగింది. దీంతో వారు ఆమెను వేధించడం ప్రారంభించారు. హయత్ నగర్ పరిధిలో నివసిస్తున్న ఆమె ఇంటిపై దాడి చేశారు. ఇంట్లోకి చొరబడి క్రీడాకారిణి, ఆమె చెల్లెళ్లతో అసభ్యంగా ప్రవర్తించారు. రోజూ వారి ఫోటోలు తీసి వేధిస్తున్నారు. మందుబాబుల దాడిలో గాయపడిన క్రీడాకారిణి హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో హయత్‌నగర్ పోలీసులు నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభిచారు.

# ఆశాల చలో హైదరాబాద్

**ఎక్కడికక్కడే పోలీసుల అరెస్ట్**




**హైదరాబాద్, మార్చి 28:** చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్‌టీయూ నేతలు, ఆశావర్కర్లు ముందస్తుగా అనుమతులు తీసుకున్నారు. కానీ ర్యాలీకి పర్మిషన్ ఇచ్చినట్లే ఇచ్చి బీఆర్‌టీయూ ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేసారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్; కార్యదర్శి మారయ్యను అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్లు ఎక్కడికక్కడ అరెస్టు చేసారు. పోలీసుల తీరుపై ఆశావర్కర్లు, బీఆర్‌టీయూ నేతలు మండిపడుతున్నారు. ధర్నాకు అనుమతులు ఇచ్చిన తర్వాత ఎందుకు అరెస్టు చేస్తున్నారని పోలీసులను నిలదీస్తున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కుతున్న గౌరవమిదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి తీరుతామని స్పష్టం చేశారు.

# మొజ్తబా ఖమేనీ మృతి?

- ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- తదుపరి లక్ష్యం క్యూబా అంటూ హెచ్చరికలు



**వాషింగ్టన్, మార్చి 28:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా కలకలం రేపుతున్నాయి. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా భావిస్తున్న మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని ట్రంప్ పేర్కొన్నారు. మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ సమ్మిట్‌లో మాట్లాడిన ట్రంప్, అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని పూర్తిగా దెబ్బతీశాయని చెప్పారు. "ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది, వైమానిక దళం నిర్వీర్యమైంది, వారి రక్షణ వ్యవస్థలు పూర్తిగా కూలిపోయాయి" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని అంచనాలకు మించి దెబ్బతీశామని, క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేశామని తెలిపారు. అయితే ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ధ్రువీకరించలేదు. సాధారణంగా అయతొల్లా అలీ ఖమేనీ కుటుంబానికి సంబంధించిన విషయాలను ఇరాన్ అత్యంత గోప్యంగా ఉంచుతుందన్నది తెలిసిందే. ఇరాన్, వెనిజులా తర్వాత తమ తదుపరి లక్ష్యం క్యూబా కావచ్చని ట్రంప్ హెచ్చరించారు. అవసరమైతే సైనిక చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. "కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది.. తర్వాతి వంతు క్యూబాదే" అని వ్యాఖ్యానించారు. అయితే వెంటనే ఆ వ్యాఖ్యలను కొంత సర్దిచెప్పే ప్రయత్నం కూడా చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అమెరికాతో చర్చలు జరుపుతున్నట్టు అంగీకరించారు. భవిష్యత్తులో ఉద్రిక్తతలు పెరగకుండా చూడాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కాగా, ట్రంప్ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకవైపు పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కొనసాగుతుండగా, మరోవైపు క్యూబాపై సైనిక చర్యల సూచనలు రావడం అంతర్జాతీయ ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశముంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచ దేశాలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి. పరిస్థితి మరింత దిగజారకుండా రాజనీతిక పరిష్కారాలే మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.

# 'లాక్‌డౌన్' ప్రసక్తే లేదు..


- వదంతులు నమ్మొద్దు : కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా మళ్లీ లాక్‌డౌన్ విధిస్తారంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ స్పష్టం చేస్తూ, దేశంలో ఇంధన కొరత ఏర్పడవచ్చనే ఆందోళనలతో ప్రజలను గందరగోళానికి గురిచేసే వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్న భయంతో పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరుతున్న తరుణంలో, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో ఆర్థిక బిల్లు 2026పై సమాధానం ఇస్తూ దేశంలో లాక్‌డౌన్ విధించే ఆలోచన గానీ అలాంటి ప్రతిపాదన గానీ ప్రభుత్వం వద్ద లేదని తేల్చి చెప్పారు. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న మాట నిజమేనని, అయితే ఎనర్జీ సప్లై చైన్, నిత్యావసరాల రవాణాను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని ఆమె భరోసా ఇచ్చారు. గత నెల రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి ఏకంగా 122 డాలర్లకు చేరినప్పటికీ, సామాన్యులపై భారం పడకుండా ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుందని నిర్మలమ్మ వివరించారు. దీనిలో భాగంగా పెట్రోల్‌పై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని రూ. 13 నుంచి రూ. 3కు తగ్గించడమే కాకుండా, డీజిల్‌పై ఉన్న రూ. 10 సుంకాన్ని పూర్తిగా ఎత్తివేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గినప్పటికీ, చమురు కంపెనీలకు మరియు సామాన్య ప్రజలకు భారీ ఊరట లభించనుంది. అంతర్జాతీయంగా పెట్రోల్ ధరలు 20 నుంచి 50 శాతం పెరిగినా, భారత్‌లో ప్రజలకు రక్షణ కల్పించేందుకే ఈ ఎక్సైజ్ సుంకాల తగ్గింపు నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. దేశంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, అసత్య ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం మరోసారి విజ్ఞప్తి చేసింది.

# మారనున్న ఆస్కార్ వేడుకల వేదిక

## 2029 నుంచి పీకాక్ థియేటర్‌లోకి మార్పు



లాస్‌ఏంజిల్స్, మార్చి 28 : ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'అకాడమీ అవార్డ్స్' ఆస్కార్ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా హాలీవుడ్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలు, 2029 నుంచి లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని కొత్త వేదికకు మారనున్నాయి. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన వివరాల ప్రకారం, 2029 నుంచి 2039 వరకు పదేళ్ల పాటు ఈ వేడుకలు లాస్ ఏంజిల్స్ లైవ్ కాంప్లెక్స్‌లోని 'పీకాక్ థియేటర్'లో జరగనున్నాయి. ఇందుకోసం ప్రముఖ వినోద సంస్థ తో అకాడమీ ఒప్పందం కుదుర్చుకుంది. 2001 నుంచి ఆస్కార్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న హాలీవుడ్ బౌలేవార్డ్ లోని 'డాల్బీ థియేటర్' యుగం, 2028లో జరగబోయే 100వ వార్షికోత్సవ వేడుకలతో ముగియనుంది. అప్పటివరకు ఈ వేడుకలు ఎబిసి ఛానల్‌లోనే ప్రసారమవుతాయి. అయితే, 2029 నుంచి 2033 వరకు జరిగే ఆస్కార్ వేడుకల ప్రసార హక్కులను యూట్యూబ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీనివల్ల రెడ్ కార్పెట్, తెరవెనుక విశేషాలు మరియు ప్రధాన వేడుక వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా అభిమానులు యూట్యూబ్‌లో ఉచితంగా వీక్షించే అవకాశం కలగనుంది. అత్యాధునిక సాంకేతికత కలిగిన వేదికపై సినిమా పండుగను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడానికి ఈ మార్పు ఎంతో దోహదపడుతుందని అకాడమీ ప్రతినిధులు పేర్కొన్నారు.

# అయోధ్య యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం

## అగ్నికి ఆహుతి అయిన పందిళ్లు

## ప్రమాదంలో ప్రాణనష్టం లేదని వివరణ




**అయోధ్య,మార్చి 28:** అయోధ్యలోని యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాజ్‌ఘాట్‌లో బటి బాబా ఆశ్రమం సమీపంలో ఉన్న మహాలక్ష్మి నారాయణ యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పెద్ద పెద్ద పందిళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. 10 అగ్నిమాపక వాహనాలు రెండు గంటల్లోనే మంటలను అదుపులోకి తెచ్చాయి. అగ్ని ప్రమాదంలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని ఉత్తర ప్రదేశ్ రవాణా శాఖ మంత్రి దయాశంకర్ సింగ్ అన్నారు. మార్చి 20 నుంచి మార్చి 28 వరకు యజ్ఞం జరిగిందని.. తొమ్మిది రోజుల పాటు జరిగిన మహాయజ్ఞం ముగిశాక ఈ అగ్నిప్రమాదం జరిగిందని వెల్లడించారు. యజ్ఞశాల ఖాళీగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగిందని.. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. కానీ లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. దాదాపు ఎకరం విస్తీర్ణంలో ఉన్న యజ్ఞశాల నిమిషాల వ్యవధిలోనే బూడిదైపోయింది. ఈ భారీ అగ్నిప్రమాదం రామ మందిరానికి కేవలం 800 మీటర్ల దూరంలో జరిగింది. శనివారం ఉదయం సుమారు 11:30 గంటలకు పూర్ణాహుతితో యజ్ఞం ముగియగానే.. భక్తులు ఇళ్లకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం తర్వాత ఈ ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణం ఇంకా స్పష్టంగా తెలియరాలేదని, దర్యాప్తు చేసేందుకు ఒక సాంకేతిక బృందాన్ని పంపుతామని మంత్రి తెలిపారు. యంత్రాంగం ఈ విషయంపై దర్యాప్తు చేస్తోందని, అసలు కారణం త్వరలోనే వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు.


# రావద్దన్నారు.. పదవి పోతుందన్నారు

## నొయిడా సెంటిమెంట్‌ను తుడిచిపెట్టాం..

## మూఢనమ్మకాలతో అభివృద్ధిని గాలికొదిలేశారు

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ






**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా శనివారం నొయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గత పాలకుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న 'నొయిడా సెంటిమెంట్' కారణంగానే గత నాయకులు ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. నొయిడాలో పర్యటిస్తే పదవి కోల్పోతామనే భయంతో, మూఢనమ్మకాలతో పాలకులు ఇక్కడకు రావడమే మానేశారని, అయితే తాను మాత్రం ప్రజా ఆశీర్వాదమే ప్రధానమని నమ్మి ఈ అపశకున ప్రచారానికి స్వస్తి పలికానని మోదీ స్పష్టం చేశారు. ఒకప్పుడు నాయకులు వదిలేసిన ఈ ప్రాంతమే ఇప్పుడు ప్రపంచ స్థాయి విమానాశ్రయంతో 'నిర్భర భారత్'కు గర్వకారణంగా నిలిచిందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఒక ఆసక్తికర అనుభవాన్ని ప్రధాని పంచుకున్నారు. గతంలో సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాను నొయిడా పర్యటనకు సిద్ధమవ్వగా, అప్పటి ముఖ్యమంత్రి స్వయంగా ఫోన్ చేసి రావద్దని వారించారని వెల్లడించారు. "మోదీజీ.. మీరు ఇప్పుడే ప్రధానమంత్రి అయ్యారు, నొయిడా వెళ్లకండి.. వెళ్తే మీ పదవి పోతుంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారని, దానికి స్పందనగా తాను మాత్రం నొయిడా ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తానని, అదే తనకు దీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశం ఇస్తుందని బదులిచ్చానని మోదీ గుర్తు చేసుకున్నారు. మూఢనమ్మకాల కంటే ప్రజల ప్రయోజనాలే మిన్న అని చాటిచెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. నొయిడా శాపం పేరిట గత మూడు దశాబ్దాలుగా యూపీ రాజకీయాల్లో ఒక భయం తాలూకు నీడలు ఉన్నాయి. 1988లో వీర బహదూర్ సింగ్ నుంచి మొదలుకొని ఎన్డీ తివారీ, ములాయం సింగ్ యాదవ్, మాయావతి, కల్యాణ్ సింగ్ వంటి దిగ్గజ నాయకులు నొయిడా పర్యటన తర్వాత పదవులు కోల్పోవడంతో ఈ సెంటిమెంట్ బలపడింది. రాజ్‌నాథ్ సింగ్ వంటి వారు కూడా ఫ్లైఓవర్‌ను ఢిల్లీ వైపు నుంచే ప్రారంభించి జాగ్రత్త పడ్డారు. అయితే, ప్రస్తుత ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పదేపదే నొయిడా పర్యటనలు చేస్తూ, తిరిగి రెండోసారి కూడా అధికారంలోకి వచ్చి ఈ మూఢనమ్మకాలకు ఎట్టకేలకు బ్రేక్ వేశారని ప్రధాని కొనియాడారు. నేడు ప్రారంభమైన ఈ విమానాశ్రయం ఉత్తరప్రదేశ్‌ను అంతర్జాతీయ పటంలో సరికొత్త స్థాయికి తీసుకెళ్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## సంపాదకీయం

# ట్రంప్‌ను నిలువరించేదెవరు?

పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఆరేలా లేవు. పరస్పర దాడులతో మరింత ఉద్రిక్తంగా మారుతోంది. దీంతో ప్రపంచ దేశాలు ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోయాయి. అమెరికాను నిలువరించే పరిస్థితి ఏ దేశానికి లేకుండా పోయింది. సుంకాలు విధించినా చైనా, భారత్ లాంటి దేశాలు సైతం కిమ్మనకుండా మిన్నకుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు చమురు సంక్షోభం నేపథ్యంలోనూ అమెరికాను కట్టడి చేయగల శక్తి ఎవరికీ లేకుండా పోయింది. ట్రంప్ కూడా ఆయుధ బలంతో రెచ్చిపోతున్నాడు. ఇది ప్రపంచ వినాశనానికి కంకణం కట్టుకున్నట్టుగా ఉంది. ఇంతటితోనే ఇది ఆగుతుందనుకోవడానికి లేదు. ఇక భూతలదాడులు జరిగితే నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నా పట్టించుకోవడం లేదు. ఆర్థికంగా దెబ్బతింటున్న పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు వస్తున్నట్లు వెల్లడించాయి. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇకపోతే హార్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ సాగిస్తున్న దిగ్బంధనంతో నౌకాయానం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభానికి ఇది కారణమైంది. ఇప్పుడు మరో జలసంధికి ముప్పు ముంచుకొచ్చింది. తమ ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించడమే ఇందుకు కారణం. ఆ నౌకామార్గమూ మూసుకుపోతే ప్రపంచానికి మరిన్ని కష్టాలు తప్పవంటున్నారు. అరేబియా ద్వీపకల్పానికి పశ్చిమాన మరో జలమార్గమే బాబ్ అల్ మాండెబ్ జలసంధి. అరబిక్ భాషలో బాబ్ అల్ మాండెబ్ అంటే 'కన్నీటి ద్వారం' లేదా 'విషాద ద్వారం' అని అర్థం. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక నౌకలు ప్రమాదానికి లోనయ్యాయి. అందువల్లే ఈ మార్గానికి ఆ పేరు వచ్చింది. 1869లో సూయజ్ కాలువను తెరిచాక మాండెబ్ జలసంధికి ప్రాముఖ్యత పెరిగింది. ఇది మధ్యధరా సముద్రం, హిందుమహాసముద్రానికి మధ్య కీలక లంకెగా మారింది. మాండెబ్ జలసంధికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక నడవాగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు 30 మీటర్లు మాత్రమే. ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల మధ్య మాండెబ్ జలసంధి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యం లో 10-12 శాతం దీని గుండానే పయనిస్తోంది. ఏటా రూ.93.95 లక్షల కోట్ల విలువైన సరకులు మాండెబ్ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా. తన అజమాయిషీలో పనిచేసే హూతీలను ఇప్పటికే మాండెబ్ మార్గంలో ఇరాన్ మోహరించింది. యెమెన్‌లోని ఈ ముఠా.. ఎర్ర సముద్ర తీరంలోని కొన్ని భాగాలను నియంత్రిస్తోంది. సముద్రంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం ఈ ముఠాకు ఉంది. 2023 అక్టోబరు 7న గాజా యుద్ధం చెలరేగాక.. పాలస్తీనావాసులకు సంఘీభావంగా హూతీలు రంగంలోకి దిగారు. ఇరాన్, చైనాలు అందించిన డ్రోన్లు, నౌకా విధ్వంసక క్షిపణులు, విస్ఫోటక బోట్లతో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీంతో ప్రధాన నౌకాయాన కంపెనీలు వేరే మార్గంలో పయనించాల్సి వచ్చింది. 2 నెలల కాలంలో 134 నౌకలపై దాడి చేశారు. ఫలితంగా ఎర్ర సముద్ర వర్తక నడవాలో అంతర్జాతీయ వాణిజ్యం 60 శాతానికిపైగా తగ్గింది. ఇందులో చాలావరకూ పశ్చిమ దేశాలతో ముడిపడినవే. నాలుగు నౌకలు మునిగిపో యాయి. మాండెబ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తే సరకు రవాణా నౌకలు ఆఫ్రికాలోని దక్షిణ భాగం నుంచి పయనించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయంతోపాటు ఖర్చులూ పెరుగుతాయి. ఇది అంతిమంగా చమురు ధరల పెరుగుదలకు, ఇంధన మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీయవచ్చు. అయితే ఈ జలసంధి దిగ్బంధనానికి ప్రయత్నిస్తే అమెరికా గట్టిగా ప్రతిఘటించవచ్చు. మాండెబ్ జలసంధిలో జిబౌటి వైపున అగ్రరాజ్యానికి భారీ సైనిక స్థావరం ఉంది.

# గజ్వేల్ రైతులకు 18 గంటల విద్యుత్ ఇవ్వాలి

- లేకపోతే ఉద్యమం తప్పదు: బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక
- వివక్ష ఆపాలి.. మల్లన్న సాగర్, కొండపోచమ్మ నీళ్లు వదలాలి



**నేటి సాక్షి, గజ్వేల్:** గజ్వేల్ నియోజకవర్గ రైతులకు కనీసం 18 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రైతుబంధు సమితి మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండ మధు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో 15 నుండి 17 గంటల విద్యుత్ ఇస్తుంటే, గజ్వేల్‌లో మాత్రం కేవలం 14 గంటలకే పరిమితం చేయడం దారుణమని వారు మండిపడ్డారు. ఎండ తీవ్రత పెరుగుతున్న తరుణంలో తక్కువ విద్యుత్ వల్ల మోటార్లు పనిచేయక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడుల కోసం అప్పులు తెచ్చిన రైతులు సాగునీరు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని విమర్శించారు. నియోజకవర్గంలో మల్లన్న సాగర్, కొండపోచమ్మ వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు విడుదల చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యుత్ కోతలను నివారించాలని, సాగునీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ధర్నాలు, నిరసనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దైవానికి భయపడి.. చోరీ సొత్తు వాపస్

- రాజనాల బండ స్వామి సన్నిధిలో 'సత్య ప్రమాణం' అంటే దొంగ గుబులు
- రూ. 50 వేల విలువైన మిషన్ ప్రత్యక్షం.. భక్తుల హర్షం



**నేటి సాక్షి, చౌడేపల్లి:** మదనపల్లె సమీపంలోని బసినికొండలో చోరీకి గురైన విలువైన సొత్తు దైవభీతితో తిరిగి లభించిన వింత ఘటన వెలుగుచూసింది. ఒకే గదిలో నివసిస్తూ కలప కోసే వృత్తి చేసే 12 మంది కార్మికులకు సంబంధించిన సుమారు రూ. 50,000 విలువైన కలప కోసే మిషన్ గురువారం రాత్రి అపహరణకు గురైంది. మిషన్ కనిపించకపోవడంతో కార్మికుల మధ్య అనుమానాలు తలెత్తాయి. దీంతో నిజాన్ని నిలదీసేందుకు అందరూ కలిసి శుక్రవారం ఉదయం ప్రసిద్ధ 'రాజనాల బండ' ఆంజనేయ స్వామి దేవస్థానంలో సత్య ప్రమాణం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం దేవస్థానంలో రసీదు కూడా తీసుకున్నారు. స్వామివారి సాక్షిగా అబద్ధం చెబితే కీడు జరుగుతుందన్న భయంతో, దొంగలించిన వ్యక్తి శుక్రవారం సాయంత్రమే మిషన్‌ను తిరిగి అదే గదిలో విడిచిపెట్టాడు. శనివారం ఉదయం కార్మికులు తమ మిషన్‌ను భక్తిశ్రద్ధలతో ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని దేవస్థాన ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి స్వామి ధ్రువీకరించారు. ఆంజనేయ స్వామి మహిమ వల్లే తమ జీవనాధారమైన మిషన్ తిరిగి దొరికిందని కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

# అరకొర నిధులు.. అసంపూర్తిగా 'పల్లె దవాఖానాలు'

- ప్రజలకు అందని సర్కారు వైద్యం.. ప్రారంభం కోసం ఎదురుచూపులు
- బిల్లులు రాక కాంట్రాక్టర్ల అవస్థలు.. పట్టించుకోని పాలకులు




**నేటి సాక్షి, ఎండపల్లి:** జగిత్యాల జిల్లా ఉమ్మడి వెల్గటూర్ మరియు ఎండపల్లి మండలాల్లో పల్లె దవాఖానాల నిర్మాణాలు అస్తవ్యస్తంగా మారాయి. గ్రామీణ ప్రజలకు చేరువలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ భవనాలు నిధుల కొరతతో అసంపూర్తిగా మిగిలిపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) కింద కిషన్‌రావుపేట, స్తంభంపల్లి, చేగ్యాం, పైడిపల్లి, ఎండపల్లి, పాతగూడూరు, గుల్లకోట గ్రామాల్లో దవాఖానాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. అయితే, పెరిగిన నిర్మాణ వ్యయాలకు అనుగుణంగా నిధులు మంజూరు కాకపోవడంతో కొన్ని భవనాలు సగం పనిలోనే నిలిచిపోయాయి. పూర్తికావాల్సిన భవనాలకు నిధులు పెంచి మళ్లీ మంజూరు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, నిర్మాణం పూర్తయిన కొన్ని దవాఖానాలు రెండేళ్లు గడుస్తున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఆధునిక సౌకర్యాలు, ఫర్నీచర్ లేక ఆ భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. అటు బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోగా, ఇటు ప్రజలకు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణీలకు అందించే కేసీఆర్ కిట్, ప్రసవ ప్రోత్సాహకాలను పునఃప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు. పల్లె దవాఖానాలు తక్షణమే అందుబాటులోకి వస్తే దూర ప్రాంతాలకు వెళ్లే అవస్థలు తప్పుతాయని, ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

# సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించండి

- ఆసిఫాబాద్ 16వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్ పర్యటన
- పారిశుద్ధ్య డ్రైవ్‌లో పాల్గొన్న వైస్ చైర్‌పర్సన్ అహ్మద్, కమిషనర్ గజానంద్



**నేటి సాక్షి, ఆసిఫాబాద్:** పట్టణ ప్రజలు తమ ఆస్తి, నీటి పన్నులు మరియు ట్రేడ్ లైసెన్స్ ఫీజులను సకాలంలో చెల్లించి ఆసిఫాబాద్ పురపాలక సంఘం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్ కోరారు. శనివారం పట్టణంలోని 16వ వార్డులో నిర్వహించిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో చెత్తను తడి, పొడి మరియు హానికర వ్యర్థాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. వైస్ చైర్‌పర్సన్ ఎండీ అహ్మద్ మాట్లాడుతూ.. దోమల నివారణకు వార్డుల్లో ఫాగింగ్ మరియు మందుల పిచికారీ ముమ్మరం చేశామని, ప్రజలు పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ గజానంద్ మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో పన్నుల వసూలు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, బకాయిదారులు వెంటనే స్పందించి మున్సిపల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ దూడల లక్ష్మి, బీఆర్ఎస్ నాయకుడు దూడల అశోక్, మున్సిపల్ సిబ్బంది మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## సీఎం గ్రామ సభకు ఏర్పాట్లు


**రౌటసంకేపల్లిలో సభా స్థలాన్ని పరిశీలించిన అధికారులు**



**నేటి సాక్షి, ఆసిఫాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఏప్రిల్ 2వ తేదీన కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నట్లు సమాచారం. 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నిర్వహించనున్న గ్రామ సభ కోసం అధికారులు ముందస్తు కసరత్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆసిఫాబాద్ మండలంలోని రౌటసంకేపల్లి గ్రామ పంచాయతీని అధికారులు శనివారం సందర్శించారు. గ్రామ సభ నిర్వహణకు అనువైన ప్రదేశాలను పరిశీలించి, భద్రత మరియు సౌకర్యాలపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి పర్యటనపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, జిల్లా యంత్రాంగం మాత్రం సర్వం సిద్ధం చేస్తోంది. ఈ పరిశీలన కార్యక్రమంలో రౌటసంకేపల్లి గ్రామ సర్పంచ్ ఆత్రం కొండు, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు దంద్రే వినోద్ మరియు మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే ఏర్పాట్లను మరింత ముమ్మరం చేస్తామని నేతలు తెలిపారు.

## కన్మనూర్‌లో సి.సి. రోడ్డు

**ఎంపీ డీకే అరుణ నిధులతో అభివృద్ధి.. పనులు ప్రారంభించిన సర్పంచ్**



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని కన్మనూర్ గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ గారి ప్రత్యేక చొరవతో, "వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్" (గ్రామీణ్) నిధుల నుంచి మంజూరైన రూ. 5 లక్షలతో నూతన సి.సి. రోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ అంకిత సురేందర్ గౌడ్, ఉప సర్పంచ్ రవి కుమార్ రెడ్డి కలిసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, రాజేష్ యాదవ్ మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రోడ్డు నిర్మాణంతో గ్రామస్తుల రవాణా కష్టాలు తీరుతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు కన్మనూరు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మరికల్ సంత బజార్ వేలంపాట పూర్తి

**రూ. 8.24 లక్షలకు దక్కించుకున్న తిరుమలయ్య**



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని సంత బజార్ వేలంపాట శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. సర్పంచ్ జి. చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ వేలం ప్రక్రియ పారదర్శకంగా సాగింది. ఈ సందర్భంగా కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ఏడాది సంత బజార్ వేలం పాటను రూ. 8,23,066గా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈ వేలంలో గ్రామానికి చెందిన తిరుమలయ్య, మొగలప్ప, అంజయ్య, రాఘవేంద్రలు పాల్గొన్నారు. ఒకరికొకరు పోటీ పడి పాట పాడగా, చివరకు తిరుమలయ్య రూ. 8,24,066కు సంతను దక్కించుకున్నారు. గత ఏడాది కూడా తిరుమలయ్యే వేలం దక్కించుకోగా, ఈసారి కూడా ఆయనే పాడుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఖాజా, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని గ్రామ అభివృద్ధి పనులకు వినియోగిస్తామని పంచాయతీ వర్గాలు తెలిపాయి.

# సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

**లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి**



**నేటి సాక్షి, గజ్వేల్:** పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) కొండంత అండగా నిలుస్తోందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం కుక్కునూరుపల్లి మండలం రామచంద్రపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్యం, ప్రమాదాల బారిన పడి ఆర్థికంగా కుంగిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. సహాయం కావాల్సిన వారు సరైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంతోష్‌రెడ్డి, రెడ్డిమైన రవీందర్ మాట్లాడుతూ.. ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్తామని చెప్పారు. తమకు ఆర్థిక సహాయం అందించినందుకు లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్, లక్ష్మణ్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# దుకాణాలు ఖాళీ చేయాలి

**మరికల్ గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులు...**



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ గ్రామ పంచాయతీకి సంబంధించిన దుకాణాల వ్యాపారులు టెండర్ ప్రకారం వచ్చే నెల ఒకటి తేదీ వరకు దుకాణాలను ఖాళీ చేయాలని మరికల్ గ్రామ సర్పంచ్ చెన్నయ్య వార్డు సభ్యులు, మరికల్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డిలు శనివారం నాడు యజమానులకు చెప్పడం జరిగింది. గ్రామ పంచాయతీకి సంబంధించిన దుకాణాలలో వచ్చేనెల ఒకటవ తేదీ వరకు ఖాళీ చేయాలన్నారు.

# గడి బురుజుల పరిరక్షణకు పిలుపు


**అక్రమ కబ్జాలపై ఆందోళన.. భూముల రక్షణే ధ్యేయం**



**నేటి సాక్షి, కోరుట్ల,(రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని చారిత్రక వారసత్వ సంపద అయిన గడి బురుజులను కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యతని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సి. ప్రభాకర్ స్మారక గ్రంథాలయ భవనంలో గడి పరివాహక భూముల పరిరక్షణపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గడి బురుజుల భూముల ఆక్రమణలపై నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామకంఠ స్థలంగా ఉన్న సుమారు 3 ఎకరాల 21 గుంటల గడి బురుజు భూమిని కొందరు వ్యక్తులు మున్సిపల్ అనుమతుల పేరుతో అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని నాయకులు ఆరోపించారు. ఈ విలువైన భూమిని కాపాడటం కోరుట్ల ప్రజలందరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఆక్రమణలను అడ్డుకోవడానికి అవసరమైతే న్యాయపోరాటం చేయడానికైనా సిద్ధమని హెచ్చరించారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా మార్చి 30వ తేదీ సోమవారం నాడు గడి బురుజుల వద్ద భారీ స్థాయిలో జనసమీకరణ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, సిపిఎం నేత కె. శంకర్, న్యూ డెమోక్రసీ నేత చింత భూమేశ్వర్, ఎఐటియుసి నేత సుతారి రాములు, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్, ఎస్పీ నేత ముజాహిద్, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు రఫీ, టిడిపి నేతలు శ్రీనివాస్ బాబు, పోతని సత్యం తదితరులు పాల్గొని మద్దతు ప్రకటించారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

**మహిళా వర్కర్లపై పోలీసుల దాడి దారుణం: భూక్యా జంపన్న**



**నేటి సాక్షి, ములుగు:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశా వర్కర్లకు వెంటనే రూ. 18,000 కనీస వేతనం అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్యా జంపన్న డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద ఆశా వర్కర్లపై జరిగిన పోలీసుల తోపులాట ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ ముట్టడి సందర్భంగా తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళా వర్కర్లపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని జంపన్న మండిపడ్డారు. అరెస్టుల పేరుతో మహిళలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని, ఈ ఘటనలో పలువురు ఆశా వర్కర్లు గాయపడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆశా వర్కర్లకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని ఆయన స్పష్టం చేశారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, ప్రభుత్వం మొండివైఖరి వీడకుంటే ఆశా వర్కర్ల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# వచ్చే నెల 7న 'రాజన్న కోడెల' పంపిణీ

- అందుబాటులో 300 కోడెలు.. చిన్న, సన్నకారు రైతులు అర్హులు
- వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**నేటి సాక్షి, వేములవాడ,(శివకుమార్):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న తిప్పాపూర్ గోశాలలోని కోడెలను వచ్చే నెల (ఏప్రిల్) 7వ తేదీన రైతులకు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సుమారు 300 మధ్యస్థ, పెద్ద పరిమాణంలో ఉన్న కోడెలను మంగళవారం ఉదయం 7:00 గంటలకు పంపిణీ చేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ మరియు పరిసర జిల్లాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. 1.5 ఎకరాల నుండి 5 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు మాత్రమే అర్హులని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డ్ మరియు సంబంధిత మండల వ్యవసాయ అధికారి (MAO AEO) నుంచి పొందిన ధ్రువపత్రాలతో సిద్ధంగా ఉండాలి. అర్హులైన రైతులు తమ వివరాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్ https.rajannasircilla.telangana.gov.in లో నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే ఏప్రిల్ 7న ఉదయం 7:00 గంటలకు తిప్పాపూర్ గోశాలకు రావాల్సి ఉంటుంది. జీవాలు పక్కదారి పట్టకుండా ప్రతి కోడెకు 'జియో ట్యాగింగ్' సౌకర్యం కల్పించామని కలెక్టర్ తెలిపారు. దీనివల్ల భవిష్యత్తులో వాటి సంరక్షణను పర్యవేక్షించడం సులభతరమవుతుందన్నారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటిని పక్కాగా సంరక్షించాలని, ఒకవేళ దుర్వినియోగం జరిగినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

# భగ్గుమంటున్న భానుడు.. ఉక్కపోతతో జనం బేజారు

- ఎండపల్లిలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు.. నిర్మానుష్యంగా రహదారులు
- అవసరమైతే తప్ప బయటకు రావొద్దు: నిపుణుల హెచ్చరిక



**నేటి సాక్షి, ఎండపల్లి:** వేసవి ఆరంభంలోనే ఎండలు ముదురుతున్నాయి. గత రెండు మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు అమాంతం పెరగడంతో పాటు ఉక్కపోత తోడవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఎండపల్లి పరిసరాల్లో గరిష్టంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవుతుండటంతో మధ్యాహ్న సమయానికి జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఎండ ప్రభావంతో ఎప్పుడూ రద్దీగా ఉండే రాజారాంపల్లి కూడలి వంటి ప్రాంతాలు మధ్యాహ్న సమయంలో జన సంచారం లేక వెలవెలబోతున్నాయి. గాలిలో తేమ శాతం పెరగడంతో చెమటలు పట్టి ఉక్కపోతతో సామాన్యులు, వృద్ధులు ఊపిరి పీల్చుకోలేక అవస్థలు పడుతున్నారు. రాబోయే రోజుల్లో ఎండలు మరింత ముదిరే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తీవ్రమైన వేడి వల్ల డీహైడ్రేషన్, వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు తరచూ మంచి నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగవద్దని, అత్యవసరమైతే గొడుగు, టోపీ ధరించాలని కోరుతున్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు ఎండ తీవ్రతను గమనించి తగిన విశ్రాంతి తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాజీ పడితేనే 'రాజమార్గం'





- కోర్టుల చుట్టూ తిరిగితే సమయం, డబ్బు వృథా: జడ్జి స్వాతి గౌడ్
- గజ్వేల్ జాతీయ లోక్ అదాలత్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కారం

**నేటి సాక్షి, గజ్వేల్ :** కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయం, డబ్బు వృథా కావడమే కాకుండా వ్యక్తిగత కక్షలు పెరిగే అవకాశం ఉంటుందని, వివాదాలను పరస్పర రాజీ ద్వారా పరిష్కరించుకోవడమే రాజమార్గమని గజ్వేల్ జూనియర్ సివిల్ జడ్జిలు స్వాతి గౌడ్, మణి వీర్ అన్నారు. శనివారం గజ్వేల్ మున్సిఫ్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి స్వాతి గౌడ్ మాట్లాడుతూ.. చిన్నచిన్న వివాదాలకు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం వల్ల కుటుంబాల మధ్య శత్రుత్వాలు పెరిగి సామాజిక సంబంధాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన సమస్యలను పరిష్కరించుకోవచ్చని, దీనివల్ల రెండు పక్షాలకు న్యాయం జరగడంతో పాటు ఖర్చులు తగ్గుతాయని వివరించారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో లోక్ అదాలత్ ద్వారా తక్కువ జరిమానాతో కేసులను పరిష్కరించినట్లు ఆమె తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని యువతను జడ్జి హెచ్చరించారు. చిన్న తప్పిదం వల్ల ప్రాణాలు కోల్పోతే కుటుంబ సభ్యులు అనాథలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన పెంచుకుని శాంతిభద్రతల రక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, వివిధ కేసుల కక్షిదారులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధియే లక్ష్యంగా పనిచేయాలి



- వెంకటాపూర్‌లో నూతన జీపీ భవనం, వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎంపీ డీకే అరుణ
- రూ. 20 లక్షల నిధులతో కార్యాలయ నిర్మాణం.. సర్పంచ్ విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానం

**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. శనివారం నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం సూర్యచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి ప్లాంట్‌ను కూడా ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వెంకటాపూర్ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, గ్రామంలో సి.సి. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు గ్రామానికి విచ్చేసిన ఎంపీకి సర్పంచ్ డోకూరు విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్య మోహన్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బెలగొంది వీరన్న, గొల్ల కృష్ణయ్య, ఉప సర్పంచ్ నరహరి, మాజీ సర్పంచ్ కళావతమ్మ పాల్గొన్నారు. అలాగే నాయకులు యుగంధర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రఘుపతి రెడ్డి, అధికారులు ఎంపీఓ పావని, పంచాయతీ కార్యదర్శి గాయత్రి మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

- సబ్ ఇన్స్పెక్టర్ కృష్ణారెడ్డి

**నేటిసాక్షి:** జగదేవపూర్ ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని జగదేవపూర్ సబ్ ఇన్స్పెక్టర్ కృష్ణారెడ్డి యువత కు విజ్ఞప్తి చేశారు ,శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు, ఈ సమావేశం లో సబ్ ఇన్స్పెక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై యువత బెట్టింగ్‌లకు పాల్పడుతూ.. ఆర్థికంగా నష్టపోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని,ఈనేపథ్యంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వాటి జోలికి వెళ్లరాదని తెలిపారు,గతంలో కొన్ని బెట్టింగ్ ఆప్స్ ప్రచారం ద్వారా వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చిందన్నారు, కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం అని పేర్కొన్నారు,ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా పెడతామని బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు అని సూచించారు, గ్రామాల్లో ఉండే యువత ఏదో ఒక పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు, అలాంటి జీవితాన్ని ,బెట్టింగ్‌ల వల్ల యువత, సామాన్యులు అప్పులపాలై, ఇళ్లు, బంగారం, పొలాలు అమ్ముకుని రోడ్డున పడుతున్నారు, అప్పులు ఎక్కువై భరించలేక యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు,ఇది కుటుంబాలను రోడ్డున పడేస్తోంది.ఆన్‌లైన్, క్రికెట్ బెట్టింగ్‌ల మాయలో పడి యువత తమ బంగారు భవిష్యత్తును, కుటుంబాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు, యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, నిషేధిత ప్లే కార్డ్స్, గేమింగ్ యాప్‌లకు, ఐపీఎల్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని



సూచించారు.ఆన్‌లైన్‌లో కానీ, ఆఫ్‌లైన్‌లో కానీ ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 8712667339 కు సమాచారం అందించాలని తెలిపారు, యువత, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల తీరుపై శ్రద్ధ వహించాలని సూచించారు.

# పకడ్బందీగా పదవ తరగతి పరీక్షల నిర్వహణ



- మేడిపెల్లి మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**నేటి సాక్షి-మేడిపల్లి:** పదవ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా శనివారం మేడిపెల్లి మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.పరీక్షా కేంద్రంలో నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలనిఅధికారులకు సూచించారు.పరీక్షా గదుల్లో వెలుతురు, తాగునీరు, శౌచాలయాల నిర్వహణ సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను పరిశీలించారు.విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.పరీక్షల సమయంలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. పరీక్షలు నిబద్ధతతో, భాద్యతగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.ఈ పరిశీలనలో డి.ఈ. వో. కె. రాము , కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధన్వాడ ముదిరాజ్ అధ్యక్షుడిగా 'నారాయణ'

- ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక.. పట్టణ అధ్యక్షుడిగా శివకుమార్
- ముదిరాజ్ సంఘం బలోపేతానికి కృషి చేయాలి: జిల్లా నాయకులు



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల ముదిరాజ్ మహాసభ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నీరటి నరసింహులు నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పటేల్ శ్రీనివాస్, జిల్లా ఇంచార్జ్ సర్పంచ్ మొగులప్ప, కావలి నరహరి, మాజీ ఎంపీటీసీ గౌని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ప్రక్రియ జరిగింది. మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడిగా నీరటి నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ధన్వాడ పట్టణ అధ్యక్షుడిగా నీరటి శివకుమార్, ఉపాధ్యక్షుడిగా గుండ్లకుంట రాములు, ప్రధాన కార్యదర్శిగా సంద బాల్ చందర్, కార్యదర్శిగా మూలింటి రామచంద్రయ్యలను ఎన్నుకున్నారు. ఇక యువజన విభాగంలో మండల యూత్ అధ్యక్షుడిగా కురుమూర్తి, పట్టణ యూత్ అధ్యక్షుడిగా పి. అనిల్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ.. ముదిరాజ్ సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి నూతన కమిటీ సభ్యులు ఐక్యమత్యంతో కృషి చేయాలని సూచించారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు నూతనంగా ఎన్నికైన సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ముదిరాజ్ సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుట్టు శిక్షణతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి



- తంగళ్ళపల్లి టెక్స్‌టైల్ పార్కును పరిశీలించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్
- యూనిఫాం క్లాత్ తయారీని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం

**నేటి సాక్షి, సిరిసిల్ల,(శివకుమార్):** మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. శనివారం తంగళ్ళపల్లి మండలంలోని టెక్స్‌టైల్ పార్కును సందర్శించిన ఆమె, చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో మహిళలకు అందుతున్న శిక్షణను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి, వారు నేర్చుకుంటున్న మెలకువలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యంతో డ్రెస్సులు, యూనిఫాంలు కుడుతూ ఆర్థికంగా రాణించాలని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం టెక్స్‌టైల్ పార్కులోని మరమగ్గాలపై సిద్ధమవుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫాం క్లాత్ తయారీని కలెక్టర్ పరిశీలించారు. ఉత్పత్తి ఎప్పటికి పూర్తవుతుందని అధికారులను ప్రశ్నించారు. గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేసి, విద్యార్థులకు యూనిఫాంలు అందేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ సంతోష్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు, ఎంపీఓ మీర్జా తదితరులు పాల్గొన్నారు.



# వైన్ షాపుల్లో ప్రాణాంతక వాటర్

### కాగజ్‌నగర్‌లో ఐఎస్ఐ ముద్ర లేని వాటర్ ప్యాకెట్ల దందా




**నేటి సాక్షి, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ బంక్ సమీపంలో గల మద్యం దుకాణాల్లో నాణ్యత లేని వాటర్ ప్యాకెట్ల విక్రయం జోరుగా సాగుతోంది. నిబంధనల ప్రకారం ఐఎస్ఐ (ISI) ముద్ర ఉన్న తాగునీటిని మాత్రమే విక్రయించాల్సి ఉండగా, నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా ప్రమాణాలు లేని ప్యాకెట్లను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. బిఐఎస్ (BIS) నిబంధనల ప్రకారం ప్యాక్ చేసిన నీటిపై తప్పనిసరిగా 'IS 14543' గుర్తింపు ఉండాలి. కానీ, స్థానిక వైన్ షాపుల ముందు నిబంధనలకు విరుద్ధంగా వాటర్ బ్యాగుల సంచులు నిల్వ ఉంచుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాణ్యత లేని ప్లాస్టిక్ ప్యాకెట్లు ఎండ వేడికి గురికావడం వల్ల రసాయనాలు నీటిలో కలిసి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కలుషిత నీటి వల్ల టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందని, మద్యం సేవించే వారి కాలేయంపై ఈ నీరు మరింత ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ మరియు ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి, తనిఖీలు చేపట్టి నాణ్యత లేని వాటర్ ప్యాకెట్లు, డిస్పోజబుల్ గ్లాసులను నిషేధించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# 30న కలెక్టరేట్ ముట్టడి

### మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ఎంఈఓకు వినతిపత్రం




**నేటి సాక్షి, తిరుమలాయపాలెం,(రుద్రరాజు):** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు షేక్ బషీరుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం తిమ్మాపురం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)కి కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బషీరుద్దీన్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు రూ. 10 వేల వేతనం ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని, ఏకరూప దుస్తులు, ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి వశిపొంగ వీరన్న మాట్లాడుతూ.. 30వ తేదీన జరిగే ధర్నాకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు పద్మ, చుంచు ఉపేంద్ర, భాగ్యమ్మ, ఉప్పలమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# మంగపేట తహసీల్దార్‌కు వినతి

### ఆదివాసీ భవనానికి స్థలం కేటాయించాలి



**నేటి సాక్షి, ములుగు:** మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల సర్వే నంబర్ 20లోని 10 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ఆదివాసీ కమ్యూనిటీ హాల్, గ్రంథాలయ నిర్మాణానికి కేటాయించాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. శనివారం తుడుందెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి పోడెం బాబు, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక లక్ష్మణ్ ఆధ్వర్యంలో మంగపేట తహసీల్దార్ తోట రవీందర్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీల సామాజిక, విద్యాభివృద్ధికి కమ్యూనిటీ హాల్, గ్రంథాలయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అయ్యోరి యాణయ్య, కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, మాజీ ఎంపీటీసీ కొమురం సారయ్య, నాయకులు కొముంరం బాలన్న, బాడిశా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.




# తొక్కిసలాట మృతులకు నివాళి..

## స్మారకార్థం 11 సీట్లు కేటాయింపు

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ ఆరంభ పోరులో చిన్నస్వామి తొక్కిసలాట మృతులకు నివాళులు అర్పించారు. టాస్ అనంతరం ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లతో పాటు స్టాండ్స్‌లోని అభిమానులందరూ లేచి నిల్చొని మౌనం పాటించారు. ఇదివరకూ చెప్పినట్టుగానే ఆ పదకొండు మంది జ్ఞాపకార్థం కర్నాటక క్రికెట్ సంఘం ప్రత్యేకంగా 11 సీట్లను కేటాయించింది. జాతీయ గీతం ఆలాపన అనంతరం మ్యాచ్ ప్రారంభమైంది. ఐపీఎల్ ఫ్రాంచైజీ ఆర్సీబీ , కర్నాటక క్రికెట్ సంఘం మాట నిలబెట్టుకున్నాయి. నిరుడు జూన్ 4వ తేదీన మరణించిన 11 మంది జ్ఞాపకార్థం చిన్నస్వామి స్టేడియంలో స్మారకం ఏర్పాటు చేయడంతో పాటు పదకొండు ప్రత్యేక సీట్లను కేటాయించాయి. ఇదివరకే మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన ఆర్సీబీ.. ఇప్పుడు వారిని ప్రత్యేకంగా స్మరించుకుంది.

# ఇదేం బ్యాటింగ్ భయ్యా..

## భారీ హిట్టింగ్ చేస్తారనుకుంటే పెవిలియన్‌కి క్యూ కట్టారు..

### షాక్‌లో ఎస్ఆర్‌హెచ్





**బెంగళూరు:** క్రికెట్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ గ్రాండ్‌గా మొదలైంది. చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరుగుతున్న ఈ తొలి మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లు తేలిపోయారు. టాస్ గెలిచిన ఆర్సీబీ మొదట ఫిల్డింగ్ తీసుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ కి వచ్చిన ఆరెంజ్ ఆర్మీ బ్యాటర్లు చెలరేగిపోతారని అనుకుంటే తుస్సుమనిపించారు. మొదటి ఓవర్లు ఓ సిక్సు కొట్టిన అభిషేక్ శర్మ మంచి ఊపు మీద కనిపించాడు.. ఫస్ట్ రెండు ఓవర్లలో 17 పరుగులు చేసిన ఎస్ ఆర్ హెచ్.. మూడో ఓవర్ లో బౌలింగ్ కి వచ్చిన జాకబ్ డఫీ బౌలింగ్ లోనే భారీ షాట్ ఆడబోయిన అభిషేక్ వికెట్ కీపర్ జితేష్ శర్మకి క్యాచ్ ఇచ్చిన అభి పెవిలియన్ కు చేరుకున్నాడు. కేవలం 8 బంతుల్లో 7 పరుగులు చేశాడు. అనంతరం మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ సైతం ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. 9 బంతుల్లో రెండు ఫోర్లు కొట్టి అదే ఓవర్లో జాకబ్ బౌలింగ్ లో ఔట్ అయ్యాడు. బౌండరీ లైన్ వద్ద ఫిల్ సాల్ట్‌కి క్యాచ్ ఇచ్చిన హెడ్ డకౌట్ కి వెళ్లిపోయాడు. అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన లోకల్ బాయ్ నితిశ్ కుమార్ రెడ్డి మాత్రం దారుణంగా విఫలమయ్యాడు. దాదాపు 6 బంతులు కేవలం 1 పరుగు మాత్రమే చేసి అభినందన్ సింగ్ కి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కి వెళ్లిపోయాడు. దీంతో బ్యాటింగ్ భారం మొత్త కెప్టెన్ ఇషన్ కిషన్ పై పడింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో భారీ హిట్టర్లకు పెట్టింది పేరు.. అలాంటి హిట్టర్లు ఈ మ్యాచులో ఘోరంగా విఫలమయ్యారు. ఎస్ఆర్ హెచ్ కోల్పోయిన మూడు వికెట్లను ఆర్సీబీ బౌలర్ జాకబ్ డఫీ ఒక్కడే తీసుకోవడం గమనార్హం. కీలకమైన వికెట్లు కోల్పోయిన ఆరెంజ్ ఆర్మీ కష్టాల్లో పడింది. ప్రస్తుతం క్రీజులో కెప్టెన్ ఇషాన్ (33లి), హెన్రీచ్ క్లాసెన్ (4లి) ఉన్నారు.



# పాక్ క్రికెట్‌కు ఘోర అవమానం

## ప్లేయర్లతో పాటు షాక్ ఇస్తున్న కామెంటేటర్లు..

**ఢిల్లీ:** పాకిస్తాన్ క్రికెట్ రోజురోజుకు దిగజారిపోతుంది. వరసగా అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయి. పాకిస్తాస్ సూపర్ లీగ్ నుంచి విదేశీ క్రికెటర్లు బయటకు వస్తున్నారు. వీరంతా ఇండియన్ ప్రీమియర్ లీగ్లో ఆడేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఐపీఎల్‌లో అమ్ముడుపోని క్రికెటర్లు మాత్రమే పీఎస్ఎల్‌లో ఆడుతున్నారనే ప్రచారం ఉంది. ఇక ఇప్పుడు, కామెంటేటర్లు కూడా పీఎస్ఎల్ వీడి ఐపీఎల్ కోసం వస్తున్నారు. పీఎస్ఎల్ కామెంటేటర్స్ ప్యానెల్‌లో ఉన్న మాజీ ఇంగ్లాండ్ స్టార్ నిక్ నైట్, ఇప్పుడు ఐపీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనికి ముందు ప్లేయర్లు దాసున్ శనక, స్పెన్సర్ జాన్సన్, బ్లెస్సింగ్ ముజరబాని వంటి ఆటగాళ్లు పీఎస్ఎల్ వీడి ఐపీఎల్‌లో చేరారు. పాక్ క్రికెట్ బోర్డ్(పీసీబీ) చీఫ్ మోహ్సిన్ నఖ్వీకి ఈ పరిణామాలు తీవ్ర అవమానంగా మిగిలిపోతున్నాయి. వెళ్లిపోయిన ఆటగాళ్లపై చర్యలు తీసుకుంటామని నఖ్వీ హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉంటే, శుక్రవారం పీఎస్ఎల్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. లాహోర్‌లో లాహోర్ ఖలందర్స్, హైదరాబాద్ కింగ్స్ మెన్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ కూడా చాలా నిశ్శబ్ధంగా జరిగింది. ప్రేక్షకులు ఎవరూ మ్యాచ్‌కు హాజరుకాలేదు. ఎలాంటి హడావుడి లేకుండా, ప్రారంభ కార్యక్రమాలు లేకుండా టోర్నీ ప్రారంభమైంది. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రజలు పెట్రోల్, డిజల్ ఆదా చేసే పనిలో ఉన్నారు. దీంతోనే ప్రేక్షకులు ఎవరూ మ్యాచ్‌కు రాలేదు. దీనికి తోడు తాలిబాన్‌తో జరుగుతున్న యుద్ధం కూడా పీఎస్ఎల్ భద్రతపై ప్రభావం చూపుతున్నాయి.



# గంభీర్ పేరుతో ఉన్న ఏఐ వీడియోలు 36 గంటల్లో తొలగించాలి

## ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఢిల్లీ హైకోర్టు ఊరట లభించింది. తన పేరును వాడుకుంటూ ఏఐ జనరేటెడ్ వీడియోలు తీశారని గంభీర్ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. శనివారం ఢిల్లీ హైకోర్టు ఈ అంశంపై విచారణ జరిపి కీలక తీర్పు వెలువరించింది. గంభీర్ పేరు, ఫొటో, వాయిస్ లేదా ఏఐ జనరేటెడ్‌తో కూడిన వీడియోలను 36 గంటల్లో తొలగించాలని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను కోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ జ్యోతి సింగ్ ధర్మాసనం తీర్పునిచ్చింది. గంభీర్ తరఫున న్యాయవాదులు పలు సోషల్ మీడియా ఖాతాలను కోర్టు ముందుంచారు. ఆన్‌లైన్ అతడి గుర్తింపును దుర్వినియోగం చేసినట్లు వాదనలు వినిపించారు. దీంతో ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, అమెజాన్, ఫ్లిప్ కార్ట్‌తో పాటు ఇతర సోషల్ మీడియా ఖాతాల్లోని కంటెంట్‌ను 36 గంటల్లో తొలగించాలని కోర్టు స్పష్టం చేసింది. ముమ్మందు ఇలాంటి అవాంఛిత కంటెంట్ ఆయా ఖాతాల్లో రాకుండా చూడాలని హెచ్చరించింది. ఉల్లంఘనకు పాల్పడిన బాధ్యుల వివరాలను వెల్లడించాలని ఆదేశించింది. భారత క్రికెట్‌కు ప్రధాన కోచ్‌గా ఉన్న గంభీర్ తన వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదించే హక్కును కాలరాయడం తగదని హైకోర్టు పేర్కొంది.



# ఐపీఎల్‌కు ధోనీ దూరం..

## శాంసన్‌కు భలే ఛాన్స్!

**ఢిల్లీ:** పంతొమ్మిదో సీజన్ ఆరంభానికి ముందే చెన్నై సూపర్ కింగ్స్ కు పెద్ద షాక్. తొలి ఎడిషన్ నుంచి సీఎస్కేకు ఆడుతున్న మహేంద్ర సింగ్ ధోనీ మెగా టోర్నీకి దూరం కానున్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోని ధోనీ తొలి రెండు వారాలు ఐపీఎల్‌కు అందుబాటులో ఉండడం లేదు. తమ వెటరన్ ఆటగాడు మెగా ఈవెంట్‌కు కొన్ని రోజులు దూరం అవుతున్నాడని శనివారం సీఎస్కే యాజమాన్యం వెల్లడించింది. ధోనీ లేకుండా చెన్నై జట్టు ఐపీఎల్ ఆడనుండడం ఇదే మొదటిసారి కానుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటి నుంచి పూర్తిగా ఐపీఎల్‌కే అంకితమైన మహేంద్ర సింగ్ ధోనీ తొలిసారి టోర్నీకి దూరమవుతున్నాడు. ఆరంభ సీజన్ నుంచి బ్రేక్ లేకుండా ఆడుతున్న తాలా ఈసారి కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు. గత సీజన్ ఫైనల్లో మోకాలి గాయంతోనే ఆడిన ధోనీ అనంతరం సర్జరీ చేయించుకున్నాడు. ఈ గాయం నుంచి కోలుకున్నా.. కండరాల గాయం ధోనీని వెంటాడింది. దాంతో, అతడికి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. అందుకే రెండు వారాలు సీఎస్కే మ్యాచ్‌లకు ధోనీ దూరం కానున్నాడు. పంతొమ్మిదో ఎడిషన్ తొలి మ్యాచ్‌లో మార్చి 30న రాజస్థాన్ రాయల్స్‌తో సీఎస్కే తలపడనుంది. రికార్డు స్థాయిలో 278 మ్యాచ్‌లు ఆడిన ధోనీ గౌర్హాజరీలో సంజూ శాంసన్ కు వికెట్ కీపింగ్ అప్పగించే అవకాశముంది. ఇటీవలే ట్రేడ్ పద్ధతిన సీఎస్కే గూటికి చేరిన శాంసన్ ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా తన ముద్ర వేసేందుకు ఇంతకుమించిన సమయం ఉండదేమో.




Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**



# చెల్లి నిర్మాత.. అన్న హీరోగా బరిలోకి

## వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మెం-త్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



# అక్షయ్‌ఖన్నాకు ప్రశాంత్ గ్రీటింగ్స్

## మహాకాళిపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ప్రకటన

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కేవలం తన నటనతోనే మాట్లాడతారని, ఆయనతో కలిసి పనిచేయడం తనకు దక్కిన గౌరవమని ప్రశాంత్ వర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ప్రశాంత్ వర్మ ప్రత్యేక పోస్ట్‌ను పంచుకున్నాడు. నిజమైన టాలెంట్‌కు అరుపులు అవసరం లేదని నిరూపించే నటుడు అక్షయ్ ఖన్నా. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, పెర్ఫార్మెన్స్ ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన క్లాస్‌ను చాటుతాయని ప్రశాంత్ వర్మ కొనియాడారు. అలాగే ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న 'మహాకాళి', 'అధీర', మరియు 'జై హనుమాన్' చిత్రాల గురించి త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు. అక్షయ్ ఖన్నా ప్రస్తుతం ప్రశాంత్ వర్మ నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రంలో అసుర గురువు 'శుక్రాచార్యుడి' పాత్రలో నటిస్తున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం అక్షయ్ ఖన్నాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ పూర్తయిందని, అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చిందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ వర్మ క్రియేట్ చేస్తున్న ఈ మైథలాజికల్ యూనివర్స్ కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.





# దురంధర్-2 ఓ చెత్త సినిమా

## అక్కసు వెళ్లగక్కిన ఓవైసీ

ధురంధర్ 2' సినిమాపై హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ 'తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్నప్పటికీ, ఒవైసీ మాత్రం దీనిని ఒక చెత్త సినిమాగా అభివర్ణించారు. ఒక మీడియా సదస్సులో ఒవైసీ మాట్లాడుతూ.. 'ధురంధర్ 2' వంటి మూడు గంటల పనికిరాని సినిమాలను చూసే సమయం తనకు లేదని అన్నారు. ఈ చిత్రం పూర్తిగా హింసను ప్రేరేపించేలా ఉందంటూ ఆయన మండిపడ్డారు. అసలు అది ఒక సినిమానా? అందులో మూడు గంటల పాటు కేవలం బూతులు, హింస తప్ప మరేమీ లేదు' అని ఆయన కొట్టిపారేశారు. ఈ సినిమాలో ముస్లింలను చిత్రీకరించిన విధానంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఈ సినిమాకు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేయగా.. ఆయన తనదైన శైలిలో హైదరాబాదీ యాసలో స్పందిస్తూ, ఇలాంటి విషయాలను తాను పట్టించుకోనని తేల్చి చెప్పారు.






## సినిమాలన్నీ అట్టర్ ప్లాప్..

# కానీ లైఫ్ సెటిల్డ్!

వెండితెరపై మెరిసిపోవాలని, స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకోవాలని ఎందరో ముద్దుగుమ్మలు కలలు కంటారు. కానీ అందం, అభినయం ఉన్నా అందరికీ అదృష్టం కలిసిరాదు. సరిగ్గా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంది అందాల భామ ఆదితి ఆర్య. టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ చేతుల మీదుగా హీరోయిన్‌గా పరిచయమైనా.. కెరీర్ పరంగా ఆశించిన సక్సెస్ అందుకోలేకపోయింది. అయితే, రీల్ లైఫ్‌లో ప్లాపులు ఎదురైనా, రియల్ లైఫ్‌లో మాత్రం ఏకంగా రూ. 12 వేల కోట్ల సామ్రాజ్యానికి కోడలై అందరినీ ఆశ్చర్యపరిచింది. చండీగఢ్‌లో జన్మించిన ఆదితి ఆర్య చదువులో టాపర్. ఫైనాన్స్, బిజినెస్ స్టడీస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఈమె, మోడలింగ్‌పై ఆసక్తితో 'ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ 2015' కిరీటాన్ని కైవసం చేసుకుంది. ఆ గుర్తింపుతోనే నందమూరి కల్యాణ్‌రామ్ సరసన 'ఇజం' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమాలో గ్లామర్ పరంగా మంచి మార్కులు కొట్టేసినా, సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడింది. ఆ తర్వాత కన్నడలో 'తంత్ర', హిందీలో రణవీర్ సింగ్ నటించిన '83' వంటి చిత్రాల్లో నటించినా అవేవీ ఆమె కెరీర్‌ను మలుపు తిప్పలేకపోయాయి. సినిమాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, ఆదితి ఆర్య తన కెరీర్ బాట మార్చుకుంది. భారతదేశంలోని అత్యంత ధనవంతులైన బ్యాంకర్లలో ఒకరైన ఉదయ్ కోటక్ కుమారుడు జై కోటక్ తో ప్రేమలో పడింది. వీరిద్దరూ కొన్నాళ్ల పాటు డేటింగ్ చేసి, గత ఏడాది ఘనంగా వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం జై కోటక్ తన తండ్రి వ్యాపార సామ్రాజ్యాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. తాజా నివేదికల ప్రకారం జై కోటక్ ఆస్తుల విలువ దాదాపు రూ.12 వేల కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. సినిమాల్లో సక్సెస్ కాకపోయినా, తన చదువు, సంస్కారంతో ఏకంగా ఒక బిలియనీర్ ఫ్యామిలీకి కోడలిగా వెళ్లి, ఇప్పుడు వైవాహిక జీవితంలో ఎంతో సంతోషంగా గడుపుతోంది ఈ మాజీ మిస్ ఇండియా.



# లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

**జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా**




**నేటి సాక్షి, వికారాబాద్:** కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన, సౌహార్ద్రపూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక సువర్ణావకాశమని జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జ్ సి.హెచ్. చంద్ర కిషోర్ అన్నారు. శనివారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జ్ చంద్ర కిషోర్ మాట్లాడుతూ.. పరస్పర చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యవర్తిత్వం (మెడియేషన్)పై అవగాహన కల్పించే లఘు చిత్రాన్ని కక్షిదారులతో కలిసి వీక్షించారు. జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా మాట్లాడుతూ.. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, రోడ్డు ప్రమాద బీమా, సివిల్ వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. దీనివల్ల ఇరు వర్గాల మధ్య సత్సంబంధాలు నెలకొంటాయని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ న్యాయవ్యవస్థకు సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ ఎం. వెంకటేశం, జూనియర్ సివిల్ జడ్జ్ శాంతి లత, వైష్ణవి సభపతి, డీఎస్పీలు జానయ్య, శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు మరియు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# టాస్క్‌ఫోర్స్ 'మెరుపు' దాడులు

**డీజిల్ ట్యాంకర్, ఎర్రమట్టి టిప్పర్, 24 గ్యాస్ సిలిండర్లు సీజ్**



**నేటి సాక్షి, వికారాబాద్:** జిల్లాలో అక్రమ రవాణా, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న వ్యాపారాలపై జిల్లా పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. ఎస్పీ స్నేహా మెహ్రా ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్కే అన్వర్ పాషా నేతృత్వంలో శనివారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో భారీగా అక్రమ నిల్వలు పట్టుబడ్డాయి. కర్ణాటక నుండి హైదరాబాద్‌కు అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్‌ను టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. మియాపూర్‌కు చెందిన గోల్కొండ రాజు అనే వ్యక్తికి చెందిన ఈ వాహనాన్ని డ్రైవర్లు కిరణ్, అనిల్‌లు నడుపుతుండగా స్వాధీనం చేసుకుని, చెంగోమల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అదేవిధంగా మన్నెగూడ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు. వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లిలో రామకృష్ణ రెడ్డి అనే వ్యక్తి తన నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 24 గ్యాస్ సిలిండర్లను (డొమెస్టిక్, కమర్షియల్) అధికారులు సీజ్ చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని వికారాబాద్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. జిల్లాలో అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా హెచ్చరించారు.

# బెట్టింగ్‌ను నిర్మూలిద్దాం

**యువతను కాపాడుకుందాం. వికారాబాద్ సీఐ రఘు కుమార్**



**నేటి సాక్షి, వికారాబాద్:** ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లను కేవలం వినోదం కోసం మాత్రమే చూడాలని, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో బెట్టింగ్ పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని వికారాబాద్ సీఐ రఘు కుమార్ యువతకు పిలుపునిచ్చారు. శనివారం పట్టణ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చిన్నగా మొదలయ్యే బెట్టింగ్ వ్యసనం చివరకు భారీ ఆర్థిక ఇబ్బందులకు, మానసిక ఒత్తిడికి దారితీస్తుందని సీఐ ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బులు కోల్పోయి నేరాల బాట పట్టడం లేదా ఆత్మహత్యలకు పాల్పడటం వంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఫోన్లను గమనిస్తూ ఉండాలని, బెట్టింగ్ యాప్స్ వాడుతున్నారా అనే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే 8712670030 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, నిందితులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# 30న బండలాగుడు పోటీలు




**నేటి సాక్షి, భానుముక్కల:** శ్రీరామనవమి పురస్కరించుకొని ఈనెల 30న భానుముక్కలలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ నాయకులు బి. వెంకటేశ్వరరావు, రంగస్వామి, రాము చౌదరి తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 80 వేలు, రెండో బహుమతి రూ. 60 వేలు, మూడో బహుమతి రూ. 40 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే వారు రూ. 800 ఎంట్రీ ఫీజు చెల్లించాలని, వివరాలకు 6281655869 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# ఖనిజ సంపదతో 'మూడు ట్రిలియన్ల' ఆర్థిక వ్యవస్థ




- నాగార్జున కళాశాలలో జియాలజీ సదస్సు.. వక్తగా డా. ఎం. ఆంజనేయులు
- యువతకు ఉపాధి అవకాశాలు మెండు: వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

**నేటి సాక్షి, నల్గొండ:** తెలంగాణలోని అపారమైన ఖనిజ సంపదను వినియోగించుకోవడం ద్వారా రాష్ట్రంలో మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించడం సాధ్యమేనని మహాత్మా గాంధీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. ఆంజనేయులు అన్నారు. శనివారం నల్గొండలోని నాగార్జున ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాల భూ విజ్ఞాన శాస్త్ర (జియాలజీ) విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. ఆంజనేయులు మాట్లాడుతూ.. జియాలజీ విభాగం ద్వారా ఖనిజ వనరులపై నిరంతరం పరిశోధనలు జరగాలని, దీనివల్ల విద్యార్థులకు, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. జియాలజీ కోర్సు పూర్తి చేసిన వారు భవిష్యత్తులో పొందే ఉన్నత ఉద్యోగ అవకాశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అంతటి శ్రీనివాసులు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఖనిజ వనరుల అన్వేషణలో జియాలజీ విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జియాలజీ శాఖాధిపతి ఇంద్రకంటి చంద్రయ్య, లెక్చరర్ కె. దుర్గాప్రసాద్ మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్కారు బడులను సమాజమే కాపాడుకోవాలి

- తిమ్మాపూర్ పాఠశాలకు 35 బెంచీలు అందజేసిన కొత్త సురేందర్ రెడ్డి
- కళింగ బ్రీడింగ్ ఫామ్ సామాజిక బాధ్యత అభినందనీయం: ఎంఈఓ సైదులు



**నేటి సాక్షి, జగదేవపూర్:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి పౌరుడిపై ఉందని జగదేవపూర్ ఎంఈఓ సైదులు అన్నారు. శనివారం తిమ్మాపూర్ మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో సర్పంచ్ పోసానిపల్లి రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో, 'కళింగ బ్రీడింగ్ ఫామ్' అధినేత కొత్త సురేందర్ రెడ్డి విద్యార్థుల కోసం 35 డ్యూయల్ డెస్క్ బెంచీలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, సామాజిక బాధ్యతగా పేద విద్యార్థుల కోసం ఈ సహాయం చేసినట్లు తెలిపారు. సర్పంచ్ రాజు మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే తన ప్రథమ కర్తవ్యమని, అడగ్గానే స్పందించిన సురేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధీకొండ శ్రీశైలం, విద్యా కమిటీ అధ్యక్షులు కొంతం కృష్ణంరాజు, ఉపసర్పంచ్ నాగరాజు, ఉపాధ్యాయులు కిరణ్, సరిత మరియు గ్రామ శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. మాతృ సంస్థకు అండగా నిలిచిన దాతను గ్రామస్తులు ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

# ఆధునిక పద్ధతులతోనే ఉద్యాన లాభాలు




- గజ్వేల్‌లో రైతు విజ్ఞాన యాత్రను ప్రారంభించిన వీసీ రాజిరెడ్డి
- తక్కువ నీటితో కూరగాయల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి

**నేటి సాక్షి, గజ్వేల్:** రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సాగులో వినియోగిస్తేనే ఉద్యాన పంటల్లో పెట్టుబడి ఖర్చులు తగ్గి నికర ఆదాయం పెరుగుతుందని తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. శనివారం విశ్వవిద్యాలయ ఆవరణలో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద ఏర్పాటు చేసిన 'రైతు విజ్ఞాన యాత్ర'ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉద్యాన ఆధారిత పరిశ్రమలు విస్తరించే అవకాశం ఉన్నందున కూరగాయల సాగుకు మంచి ఆదరణ ఉంటుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున, వరి పత్తికి బదులుగా తక్కువ నీటితో పండే కూరగాయల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. బిందు సేద్యం (డ్రిప్) ద్వారా వేసవిలో కూడా అధిక విస్తీర్ణంలో సాగు చేసుకోవచ్చని, సొంతంగా జీవ ఎరువులు తయారు చేసుకుని రసాయనాల వినియోగం తగ్గించాలని కోరారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె. వెంకట రమేష్ నేతృత్వంలో పెద్దపల్లి జిల్లాకు చెందిన 40 మంది రైతులు మహారాష్ట్రలోని బారామతి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించేందుకు బయలుదేరారు. అక్కడ ఆధునిక సాగు పద్ధతులను పరిశీలించి మన ప్రాంతంలో అమలు చేయాలని వీసీ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డీన్ డా. జె చీనా, విస్తరణ సంచాలకులు డా. టి. సురేష్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వరి ధాన్య సేకరణ లక్ష్యాలను అధిగమించాలి

- రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలి: అదనపు కలెక్టర్ రాజేశ్వరి
- జిల్లాలో 129 సేకరణ కేంద్రాల ఏర్పాటు.. అధికారులతో సమీక్ష



**నేటి సాక్షి, వికారాబాద్:** రబీ సీజన్‌కు సంబంధించి వరి ధాన్య సేకరణలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి ఆదేశించారు. శనివారం వికారాబాద్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పౌరసరఫరాలు, రవాణా మరియు అనుబంధ శాఖల అధికారులతో ఆమె కార్యాచరణ ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ ఏజెన్సీల ద్వారా లక్ష మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 10 వేల మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న 129 ధాన్య సేకరణ కేంద్రాలను అధికారులు సందర్శించి, అక్కడ రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్య సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. ముఖ్యంగా ధాన్యం రవాణాలో జాప్యం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, రవాణా అధికారి వెంకట్ రెడ్డి మరియు రవాణా కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# కోరుట్లలో మానవ హక్కుల కార్యాలయం ప్రారంభం

- సభ్యులకు ఐడీ కార్డుల పంపిణీ.. అవినీతి రహిత సమాజమే లక్ష్యం
- నేషనల్ వెల్ఫేర్ సెక్రెటరీ ఆకుల చందు హాజరు



**నేటి సాక్షి, కోరుట్ల,(వి.ఆర్.ధర్మేంద్ర):** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో 'ఆర్జీఎన్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్' (HR ACA) నూతన కార్యాలయం ఘనంగా ప్రారంభమైంది. సంస్థ చైర్మన్ ఫౌండర్ దేవానంద నాయుడు, నేషనల్ సెక్రెటరీ భూక్య శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన సభ్యులకు సంస్థ ఐడీ కార్డులను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన నేషనల్ వెల్ఫేర్ సెక్రెటరీ ఆకుల చందు మాట్లాడుతూ.. మానవ హక్కుల పరిరక్షణకు, అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ నలిగంటి మల్లేశ్వరి, స్టేట్ ఇంచార్జ్ జి. మహిపాల్, నిజామాబాద్ జిల్లా ప్రెసిడెంట్ శ్యామ కిషన్, జగిత్యాల జిల్లా ఇంచార్జ్ సాంబార్ మహేష్, ఉమెన్స్ వింగ్ ప్రతినిధులు ముదిగొండ శిరీష, సాంబార్ సంతోష మరియు సభ్యులు భోగా నాగేశ్వర్, మహమ్మద్ అబ్దుల్ మాజీద్, వడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలి

- లక్సెట్టిపేట మున్సిపల్ బడ్జెట్ రూ. 25.80 కోట్లు.. అదనపు కలెక్టర్ చంద్రయ్య
- బయో మైనింగ్ పనుల పరిశీలన.. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



**నేటి సాక్షి, మంచిర్యాల:** మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య సూచించారు. శనివారం లక్సెట్టిపేట మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ దొంత అంజలి, కమిషనర్ విజయ్‌కుమార్‌లతో కలిసి నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 25 కోట్ల 80 లక్షల అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఇందులో రూ. 3.42 కోట్ల సాధారణ ఆదాయం, రూ. 21.42 కోట్ల గ్రాంట్లు ఉంటాయని అదనపు కలెక్టర్ వివరించారు. మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని డంప్ యార్డ్‌లో జరుగుతున్న బయో మైనింగ్ పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పాత చెత్తను శాస్త్రీయ పద్ధతిలో వేరు చేసే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణానికి హాని కలగకుండా ప్రక్రియను వేగవంతం చేసి, పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ రాజేశ్వరి మరియు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# పిండిప్రోలు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రామకృష్ణ

- బాధ్యతలు స్వీకరించిన నూతన ప్రిన్సిపాల్.. ఘనంగా స్వాగతం పలికిన సిబ్బంది
- విద్యార్థుల క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: సరికొండ రామకృష్ణ



**నేటి సాక్షి, తిరుమలాయపాలెం,(రుద్రరాజు):** మండల పరిధిలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా సరికొండ రామకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సరూర్ నగర్ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేసిన ఆయన, పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఎఫ్.ఏ.సి ప్రిన్సిపాల్ జి. ఉపేంద్ర నుండి ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుదల, క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, లెక్చరర్లు నారాయణరావు, మురళీకృష్ణ, పరశురాం, శ్రీలత, నాన్ టీచింగ్ స్టాఫ్ రాందాస్, శ్రీనివాస్, సాయికుమార్ తదితరులు పాల్గొని నూతన ప్రిన్సిపాల్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# తుమ్మలూరులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ





- అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం: వేల్పుల ఆనంద్ కుమార్ ఐఆర్ఎస్
- ఘనంగా నిర్వహించిన గ్రామస్తులు.. పాల్గొన్న ప్రముఖులు

**నేటి సాక్షి, పాములపాడు,(తుమ్మలూరు):** భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ శనివారం పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామంలో ఘనంగా జరిగింది. ఎన్ హెచ్ 340 సి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఐఆర్ఎస్ అధికారి వేల్పుల ఆనంద్ కుమార్, చంద్రమౌళి, వాడాల త్యాగరాజు, జడ్పిటిసి రామలింగేశ్వర్ రెడ్డి, ఎస్సై తిరుపాలు ఆవిష్కరించారు. అనంతరం కూన నాగన్న అధ్యక్షతన జరిగిన సభలో ఐఆర్ఎస్ అధికారి వేల్పుల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. దళిత, పీడిత వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. ప్రపంచంలోని సగం దేశాలు ఆయన రాజ్యాంగ రచనలను ఆదర్శంగా తీసుకుని పరిపాలన చేస్తున్నాయన్నారు. స్వేచ్ఛతో పాటు సమానత్వం ఉంటేనే నిజమైన ప్రజాస్వామ్యం విరాజిల్లుతుందని అంబేద్కర్ చెప్పారని గుర్తు చేశారు. వివేకానంద స్కూల్ కరెస్పాండెంట్ ఆర్ఎస్ఆర్ గోపాల్ మాట్లాడుతూ.. తొలి న్యాయశాఖ మంత్రిగా అంబేద్కర్ మహిళా సాధికారతకు, అంటరానితనం రూపుమాపడానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. సమున్నత జ్ఞాన శిఖరమైన అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వాడాల త్యాగరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాద్, రైతు సంఘం నాయకులు డి. స్వామన్న, కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల రాజు, ఆర్టీసీ మెకానిక్ వెంకటేశ్వర్లు, మాల మహానాడు నాయకులు కలబండి అంకన్న, డాక్టర్ వెంకటేష్, బీసీ సంఘం నేత బత్తుల సంజీవ రాయుడు, గట్టు శంకర్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు గుంపుల వెంకటేశ్వర్లు, సగినేల అచ్చన్న, సిపిఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు. చదువు అసమానతలను రూపుమాపుతుందని, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# సుబ్లేడులో మెగా హెల్త్ క్యాంప్

**అన్ని విభాగాల స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరు..**



**నేటి సాక్షి, తిరుమలాయపాలెం,(రుద్రరాజు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 30వ తేదీ సోమవారం సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ప్రాఆకే)లో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి. వసుంధర తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ హెల్త్ క్యాంప్‌లో స్త్రీ వైద్య నిపుణులు, చిన్నపిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్స్, కంటి, దంత మరియు ఎముకల వైద్య నిపుణులు పాల్గొంటారని తెలిపారు. వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపునకు వచ్చేవారు తమ వెంట తప్పనిసరిగా ఆధార్ కార్డును తీసుకురావాలని సూచించారు. ఉదయం 9 గంటలకల్లా సుబ్లేడు పీహెచ్‌సీకి చేరుకోవాలని డాక్టర్ వసుంధర విజ్ఞప్తి చేశారు.

# గ్రామాభివృద్ధే మా ముఖ్య ధ్యేయం

**రూ. 45 లక్షలతో సి.సి. రోడ్ల పనులకు భూమిపూజ**



**నేటి సాక్షి, పాములపాడు:** మిట్టకందాల గ్రామ పంచాయతీని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ జి. హరిప్రసాద్ యాదవ్ అన్నారు. శనివారం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సి.సి. రోడ్డు పనులకు ఆయన పార్టీ నాయకులతో కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని తెలిపారు. నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్త జయసూర్యల సహకారంతో సుమారు రూ. 45 లక్షల వ్యయంతో గ్రామంలో 7 సి.సి. రోడ్లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బూత్ ఇంచార్జ్ ఎల్. శివరాముడు, నాయకులు ఎల్. సురేష్, కోడుమూరు శీను, శేఖర్, రమణారెడ్డి, దేవరాజు, అఖిల్, వడ్డే మధు, మద్దిలేటి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

# వంట గ్యాస్ అందించాలి

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం రమేష్ బాబులి..**



**నేటి సాక్షి,(జూపాడుబంగ్లా):** నందికొట్కూరు నియోజకవర్గంలో వంటగ్యాస్ ప్రజలకు సక్రమంగా అందడం లేదని ఊరి బయట వంట గ్యాస్ ఆటోలు ఉండడం వల్ల ప్రజలు బారులు తీరుతున్నారని దీనివల్ల భయాందోళనలు ఎక్కువయ్యాయని తక్షణమే ప్రతి ఇంటి దగ్గరికి ఆటో వెళ్లి బుక్ చేసుకున్న లబ్ధిదారునికి గ్యాస్ పంపిణీ చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. శనివారం జూపాడుబంగ్లా ఎంపీడీవో కార్యాలయం ఎదుట కేజీ రోడ్డుపై వందలాది మంది లబ్ధిదారులతో కలిసి సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం రమేష్ బాబు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కలెక్టర్ గారు ప్రజలకు వంట గ్యాస్ సమస్య ఎక్కడా లేదని ప్రజలకు సక్రమంగా అందుబాటులో ఉందని చెప్పారని అయితే గ్యాస్ యజమాన్యాలు కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోవడంలేదని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎక్కడో ఊరి బయట ఆటోలు నిలిపి గ్యాస్ తీసుకోవాలనడంతో వందలాదిమంది లబ్ధిదారులు క్యూ కడుతున్నారని గత 20 రోజుల నుండి బుక్ చేసుకున్న వంట గ్యాస్ ఇంతవరకు రాలేని పరిస్థితి ఉందని తక్షణమే ఈ విషయంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు..వంట అంత గ్యాస్ ఆటోలు పబ్లిక్ కాకుండా ప్రైవేటుగా ఉంచడం వల్ల ప్రజలు గ్యాస్ అందుతుందో లేదో అని తీవ్రబోయందులలో ఉన్నారన్నారు. తక్షణమే యాజమాన్యాలు అధికారులు ప్రజల ఇబ్బందుల గురి చేయకుండా వంటగ్యాస్ అందించాలన్నారు లేని పక్షంలో వంట గ్యాస్ కార్యాలయాల దగ్గర సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు మద్బుల్ భాష నరసింహ రాజు తో పాటు వందల మంది లబ్ధిదారులు పాల్గొన్నారు..

# చౌడేపల్లిలో పారిశుద్ధ్య పనులు

కాలువల్లో పూడిక తీత.. చెత్తాచెదారం తొలగింపు



**నేటి సాక్షి, చౌడేపలి:** మండల కేంద్రమైన చౌడేపల్లిలో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారం డిప్యూటీ ఎంపీడీవో ఎస్.ఏ. గఫూర్ పర్యవేక్షణలో పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ముఖ్యంగా గోసలకురపల్లి, బీసీ కాలనీ మరియు పట్టణ శివారు ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికను, చెత్తాచెదారాన్ని సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇళ్ల మధ్యలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాలువల్లో వ్యర్థ పదార్థాలు వేయరాదని స్థానికులకు సూచించారు. పంచాయతీ సిబ్బంది ఉదయాన్నే ఇళ్ల వద్దకు వచ్చే సమయంలో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని కోరారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలరని ఆయన పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గన్నేరువరంలో పోచమ్మ బోనాలు

శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవానికి అంకురార్పణ..

**నేటి సాక్షి, గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాల (సిద్ధోగం) వేడుకను ఘనంగా నిర్వహించనున్నట్లు కౌండిన్య వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు బుర్ర తిరుపతి గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్ని కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జమదగ్ని కళ్యాణ మహోత్సవానికి సంబంధించి మొదటి ఘట్టంగా పోచమ్మ బోనాలను నిర్వహించడం ఎప్పటి నుండో వస్తున్న ఆనవాయితీ అని ఆయన వివరించారు. ఈ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గౌడ కులస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ బోనాల ఉత్సవానికి గౌడ కులస్తులతో పాటు గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

# విద్యార్థుల ఆర్థిక సాయం



**నేటి సాక్షి, అనంతగిరి:** మండలంలోని త్రిపురవరం గ్రామానికి చెందిన మిత్రుడు కొరివి సత్యనారాయణ ఆకస్మిక మరణంపై అతని తోటి విద్యార్థులు మానవత్వం చాటుకున్నారు. 1996 పదవ తరగతి బ్యాచ్ మిత్రులంతా కలిసి సత్యనారాయణ కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించి, రూ. 45 వేల నగదుతో పాటు 75 కేజీల బియ్యాన్ని సేకరించారు. శనివారం మిత్రుని తల్లి కొరివి ధనమ్మకు ఈ సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు రాజశేఖర్, నరసింహారావు, నాగరాజు, ధనమూర్తి, నరసింహచారి, శ్రీను, వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులపై దాడి అమానుషం

నిర్మల్ ఘటనపై కోరుట్ల ఐఎంఏ తీవ్ర ఆగ్రహం



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** నిర్మల్‌లో డాక్టర్ సంతోష్ రాజ్, ఆసుపత్రి సిబ్బందిపై జరిగిన దాడిని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (IMA) కోరుట్ల శాఖ తీవ్రంగా ఖండించింది. శనివారం ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రేగొండ రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వైద్యులు తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రాణాలను కాపాడే రక్షకులపై హింసాత్మక దాడులకు పాల్పడటం మానవత్వానికే మచ్చ అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు డాక్టర్ అనూప్ రావు, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో రాత్రింబవళ్లు సేవలు అందించే వైద్యులపై దాడులు జరిగితే వైద్య వ్యవస్థ దెబ్బతింటుందని, తద్వారా సామాన్య ప్రజలే నష్టపోతారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఆసుపత్రుల్లో తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, దోషులపై కఠిన చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చికిత్స చేసే చేతులను గౌరవించాలి కానీ గాయపరచకూడదని వారు పిలుపునిచ్చారు. దాడికి గురైన వైద్యులకు కోరుట్ల ఐఎంఏ పూర్తి సంఘీభావం ప్రకటించింది. ప్రజలు హింసకు దూరంగా ఉండి, వైద్యులను నమ్మి గౌరవించాలని విజ్ఞప్తి చేశారు.

# అడవి మంటల నివారణపై అవగాహన



- అక్రమ కలప రవాణా చేస్తే కఠిన చర్యలు: ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామారావు
- అటవీ సంపదను కాపాడుకోవడం అందరి బాధ్యత

**నేటి సాక్షి, తిరుమలాయపాలెం,(రుద్రరాజు):** ఎండాకాలంలో అడవుల్లో మంటలు చెలరేగే ప్రమాదం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కూసుమంచి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామారావు సూచించారు. శనివారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. సిగరెట్ ముక్కలు, అగ్గిపెట్టెలు నిర్లక్ష్యంగా పడేయడం వల్ల పెద్ద ఎత్తున అగ్ని ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ వ్యర్థాలను తగులబెట్టే సమయంలో అవి అటవీ ప్రాంతానికి విస్తరించకుండా జాగ్రత్త పడాలన్నారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న చెట్లకు నిప్పు పెట్టే వారిపై అటవీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమ కలప రవాణా చేస్తే జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు కాలువ కింద పోతున్న అటవీ భూమికి బదులుగా పులిగుట్ట ప్రాంతంలో భూమిని కేటాయించినట్లు తెలిపారు. వృక్షాలను కాపాడటం ద్వారానే వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా వర్షాలు కురుస్తాయన్నారు. మంటలు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి భవ్య, సర్పంచ్ ధరావత్ సుజాత, ఉపసర్పంచ్ బుర్ర వాసు, మాజీ ఎంపీపీ అశోక్, వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గిరిజన చట్టాల పేరుతో అక్రమ వసూళ్లు

- ఉపాధ్యాయుడి ముసుగులో భూ ఆక్రమణలు: అంబేద్కర్ సంఘం నేతలు
- వైషమ్యాలు సృష్టిస్తే ఊరుకోం.. బాసారికాని హరికృష్ణ హెచ్చరిక



**నేటి సాక్షి, ములుగు:** మంగపేట మండలంలో గిరిజన చట్టాలను అడ్డం పెట్టుకుని కొందరు వ్యక్తులు అక్రమ వసూళ్లకు, భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని తెలంగాణ అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షులు బాసారికాని హరికృష్ణ ఆరోపించారు. శనివారం మండల అధ్యక్షుడు యెంపెల్లి వీరాస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎడ్ల నరేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ, ప్రభుత్వ జీతం తీసుకుంటున్న గొప్ప వీరయ్య అనే వ్యక్తి విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా అక్రమ దందాలకు పాల్పడుతున్నారని హరికృష్ణ ధ్వజమెత్తారు. గిరిజన చట్టాల పేరుతో గిరిజనేతరులను భయభ్రాంతులకు గురిచేస్తూ, అమాయక గిరిజనులను రెచ్చగొట్టి వైషమ్యాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పేద దళితులు, బీసీలు, మైనార్టీల ఇళ్ల స్థలాలను అడ్డుకుంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ పక్కన వీరయ్య ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకుని, అక్కడ ప్రభుత్వ లైబ్రరీని నిర్మించాలని డిమాండ్ చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం చట్టాలను వాడుకుంటున్న ఇతని ఆగడాల నుండి మంగపేట ప్రజలను కాపాడాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బోడ రామచంద్రయ్య, దాసరి ఎల్లన్న, జాడి సాంబశివరావు, దుర్గం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను 'స్వతంత్ర సమరయోధులు'గా గుర్తించాలి



- ఎన్నికల హామీలు నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి డిమాండ్
- రూ. 50 వేల పెన్షన్, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

**నేటి సాక్షి, మంచిర్యాల,(శ్రీధర్ దమ్ము):** తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో పాల్గొన్న వారిని స్వతంత్ర సమరయోధులుగా గుర్తించి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉద్యమకారుల సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేశారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు ముగియకముందే ఉద్యమకారుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యమకారుడికి నెలకు రూ. 50 వేల పెన్షన్, 250 గజాల ఇంటి స్థలం, కార్పొరేట్ వైద్యం కోసం హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. సీమాంధ్ర పాలనలో కేసులు ఎదుర్కొని, ఆర్థికంగా, శారీరకగా నష్టపోయిన వారిని ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వంపై మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో 'జై తెలంగాణ', 'ఉద్యమకారుల ఐక్యత వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు మురహరి, కార్యదర్శి గంగన్న, నాయకులు కస్తూరి సూర్యం, మోహన్ లాల్, రమేష్, అంజయ్య, పులి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ మార్కెట్‌లో అక్రమ గేట్లు తొలగించాలి





- ప్రజా రహదారులు ప్రైవేట్ అడ్డాలుగా మారుతున్నాయి..
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం.. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్

**నేటి సాక్షి, కాగజ్‌నగర్,కొమరం భీం ఆసిఫాబాద్:** కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ప్రజా రహదారులు ప్రైవేట్ వ్యక్తుల అడ్డాలుగా మారుతున్నాయి. కొందరు వ్యాపారులు బహిరంగ రోడ్లను తమ సొంత ఆస్తులుగా భావిస్తూ ఇష్టారాజ్యంగా ఆక్రమిస్తుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ ప్రాంతంలో కొందరు వ్యాపారులు ఏకంగా రోడ్లపై ఇనుప గేట్లు వేసి పాదచారుల దారిని పూర్తిగా మూసివేశారు. పబ్లిక్ రోడ్లను తమ కార్లు, బైకుల పార్కింగ్ కోసం వాడుకుంటూ, అక్కడ ఇతరులు వాహనాలు నిలపకుండా 'నో పార్కింగ్' బోర్డులు పెడుతుండటం గమనార్హం. వ్యాపారుల ఈ తీరుతో మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు, బాటసారులు నడవడానికి కూడా వీలు లేకుండా పోతోంది. ఈ ఆక్రమణల గురించి మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారని ఆరోపిస్తున్నారు. సామాన్యుల రాకపోకలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మాకు ప్రాణహాని ఉంది

రక్షణ కల్పించండి

**నేటి సాక్షి, అనంతగిరి:** తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని గొండ్రియాల గ్రామానికి చెందిన కన్నేటి భాగ్యమ్మ, రామారావు అనే వృద్ధ దంపతులు అధికారులను వేడుకున్నారు. శనివారం వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 101లో తాము కొన్న 1.20 గుంటల భూమిని తన సోదరుడు నాగయ్య అప్పటి రెవెన్యూ అధికారితో కలిసి అక్రమంగా పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. న్యాయం కోసం పోరాడుతున్న తమపై దాడులకు పాల్పడుతూ బెదిరిస్తున్నారని, ఒంటరిగా ఉంటున్న తమను ఆదుకొని భూమిని ఇప్పించాలని అధికారులను కోరారు.





# వీరత్వానికి ప్రతీక

## విజయ మారుతి పతాక!

- విజయ యాత్రను ప్రారంభించిన శ్రీశ్రీ 1008 సుదర్శన ఆశ్రమ దండి స్వామి (కాశీ పీఠాధిపతి)
- యాత్రను ముందుండి నడిపించిన బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్
- కోరుట్లలో ఘనంగా వీర హనుమాన్ విజయ యాత్ర
- ఐక్యతా నినాదాలతో మార్మోగిన పట్టణ వీధులు
- భక్తి, ఉత్సాహం, సంస్కృతి సమ్మేళనంగా శోభాయాత్ర



**నేటి సాక్షి, కోరుట్ల(రాధారపు నర్సయ్య):** శ్రీరామ భక్తుడైన ఆంజనేయ స్వామి కరుణాకటాక్షాలు కోరుతూ, జై శ్రీరాం నినాదాలతో కోరుట్ల పట్టణం మునిగిపోయింది. వీరాంజనేయుడి ఆరాధనలో యువత ఉత్సాహం, భక్తుల ఆత్మీయత కలసి 'వీర హనుమాన్ విజయ యాత్ర'ను ఆధ్యాత్మికోత్సవంగా మలిచాయి. శనివారం రాత్రి కోరుట్ల పట్టణంలో నిర్వహించిన వీర హనుమాన్ విజయయాత్ర భక్తులకు కన్నులపండువగా సాగింది. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో పట్టణ ప్రధాన వీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. హనుమంతుడు భక్తితో నిండిన ఈ యాత్రలో 'జై శ్రీరామ్' నినాదాలు మారుమోగుతూ ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని రేకెత్తించాయి.!

### ఆధ్యాత్మికంగా ప్రారంభమైన యాత్ర

కోరుట్ల పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ముందు ఈ యాత్రను శ్రీశ్రీ 1008 సుదర్శన ఆశ్రమ దండి స్వామి (కాశీ పీఠాధిపతి) ఘనంగా ప్రారంభించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్ యాత్రను ఉత్సాహంగా ముందుండి నడిపించారు. ప్రారంభం నుంచే భక్తుల జోష్, క్రమశిక్షణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

### చూడముచ్చటగా శోభాయాత్ర.!

ఈ విజయయాత్రలో శ్రీరాముడు, వీరాంజనేయుడు, దుర్గాదేవి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. డీజే సౌండ్ సిస్టమ్‌లతో హనుమాన్ భక్తులు ఆటా పాటలతో సందడి చేస్తూ, నినాదాలతో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. పట్టణ వీధులన్నీ భక్తి గీతాలతో మార్మోగిపోవడం, ప్రతి మూలలో ఆధ్యాత్మిక శోభ పరచుకోవడం ఈ యాత్ర ప్రత్యేకతగా నిలిచింది.

### ఐక్యతా సంకల్పంతో ముందుకు

ఈ యాత్రలో పాల్గొన్న భజరంగ్ దళ్ కార్యకర్తలు, స్థానిక యువత సనాతన ధర్మ పరిరక్షణ కోసం కట్టుబడి పనిచేస్తామని సంకల్పం వ్యక్తం చేశారు. సమాజంలో ఐక్యత, సంప్రదాయ పరిరక్షణకు తమ వంతు కృషి కొనసాగుతుందని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక కౌన్సిలర్లు, కుల సంఘాల ప్రతినిధులు పార్టీలకతీతంగా పాల్గొని యాత్రకు ఘనత చేకూర్చారు. వందలాది మంది భక్తులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయడంతో కోరుట్లలో ఈ యాత్ర ఒక ఆధ్యాత్మిక వేడుకగా నిలిచింది. పట్టణ ప్రజలు.. పిల్లలు ఉత్సాహంగా పాల్గొని దేవతామూర్తులతో 'సెల్ఫీలు' దిగారు.

### పోలీసుల పటిష్ట బందోబస్తు.!

మెట్ పల్లి డిఎస్పీ రాములు పర్యవేక్షణలో కోరుట్ల సిఐ సురేష్ బాబు దగ్గరుండి విజయ యాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఎస్ఐలు శ్రీధర్, రామచంద్రం, నవీన్ కుమార్ లు భద్రతా చర్యలు చేపట్టారు.











